



రథంలో కొలువుదీరిన ఉత్సవర్లు



భక్తజనం నడుమ సాగుతున్న జగన్నాథుడి రథం

# హరేరామ.. హరేకృష్ణ!

## నెల్లూరులో వైభవంగా జగన్నాథ రథయాత్ర

నెల్లూరు (సాంస్కృతికం) : హరేకృష్ణ హరేకృష్ణ.. హరేరామ హరేరామ.. రామ రామ కృష్ణ కృష్ణ అంటూ భక్తుల నామస్మరణలతో నెల్లూరు నగరం మారుమోగింది. శనివారం సాయంత్రం ఇస్కాన్ 11వ జగన్నాథ రథయాత్ర వైభవంగా సాగింది. ఈ రథయాత్ర తిలకించేందుకు భక్తులు తరలిరాగా, ఇతర రాష్ట్రాల నుంచి ఇస్కాన్ భక్తులూ పాల్గొన్నారు. రథం తిరిగిన వీధుల్లో ఆధ్యాత్మికత, భక్తిపారవశ్యం ఉప్పొంగింది. తొలుత సంతపేటలోని నాలుగుకాళ్ల మండపం వద్ద రథానికి గుమ్మడికాయతో దిష్టితీసి ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ సుకదేవ స్వామి రథయాత్రను ప్రారంభించారు. అంతకుముందు జరిగిన ఆధ్యాత్మిక సభలో శ్రీప్రభుపాద జీవిత చరిత్ర గ్రంథం, గుడ్డ సంచులను ఆవిష్కరించారు. అనంతరం రథంలో కొలువుదీరిన శ్రీకృష్ణ బలరామ సుభద్ర విగ్రహాలకు విశేష పూజలు, హారతులు ఇచ్చారు. సంతపేట, ఏసీబొమ్మ సెంటర్, ట్రంకు రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, ముత్తుకూరు గేట్, మినీబైపాస్‌రోడ్డు, అన్నమయ్య సర్కిల్, పీవీఆర్ కల్యాణ మండపం వరకు ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసశ్యామ్ (హోసూరు), మహాసింగ్‌దాసా (కూకట్‌పల్లి), చక్రధర్‌ద దాస్ (విజయవాడ), గోపీనాథ్ దాస్ (పెరంబూర్), రూపేష్ చైతన్యదాస్ (తిరుపతి), వైష్ణవదాస్ (కర్నూలు), కీర్తిరాజ్‌దాస్ (చీరాల), కరుణసింధు దాస్ (ఝాన్సీ) తదితరులు పాల్గొన్నారు.



పులిహోర ప్యాకెట్ల కోసం ఎగబడుతున్న మహిళలు

## 'ఆసరా'లో ఆకలి కేకలు

వరికుంటపాడు, ఫిబ్రవరి 3: 'ఆసరా' పేరుతో ఆర్భాటపు ప్రచారం చేస్తున్న పాలకులు కనీసం కార్యక్రమంలో పాల్గొన్న అక్కా చెల్లెమ్మలకు ఆకలి తీర్చలేకపోతున్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఉదయగిరి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సమక్షంలోనే పొదుపు మహిళలు ఆకలి కేకలు వేస్తూ ఇళ్లకు వెళ్లిపోయారు. సమావేశం ఆలస్యంగా ప్రారంభమైనా నాయకులు ఊకదంపుడు ప్రసంగాలు చేస్తూ మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగించారు. అప్పటికే విసిగిపోయిన మహిళలు సిద్ధమయ్యారు. భోజనాలు వస్తున్నాయని నాయకులు, అధికారులు పదే పదే మైకుల్లో చెప్పి నిలిపివేశారు. కాసేపటికి భోజనాలు తెచ్చినా ఏర్పాట్లు సరిగ్గాలేక తోపులాట చోటు చేసుకుంది. తెచ్చిన పులిహోర ప్యాకెట్లు కూడా చాలకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మహిళలు ఇళ్ల వెళ్లిపోయారు. మరోవైపు ఈ కార్యక్రమానికి అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు డుమ్మా కొట్టడం చర్చనీయాంశంగా మారింది.

## కావలి టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి

● ఖరారు చేసిన అధిష్ఠానం

నెల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కావలి అసెంబ్లీ నియోజకవర్గానికి టీడీపీ అభ్యర్థిగా దగు మాటి వెంకటకృష్ణారెడ్డి అలియాస్ కావ్య కృష్ణారెడ్డిని ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ఈ స్థానం కోసం పలువురు నాయకులు పోటీపడినా చివరికి అభ్యర్థిత్వం వెంకట కృష్ణారెడ్డినే వరించింది. 2004 నుంచి టీడీపీలో కొనసాగుతున్న కృష్ణారెడ్డి గత ఎన్నికల్లో టికెట్టు ఆశించినా దక్కలేదు.



దీంతో ఆయన కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. గత ఏడాది మహానాడు సందర్భంగా ఆయన మళ్లీ టీడీపీకి దగ్గరయ్యారు. యువగళం పాదయాత్రలోనూ చురుగ్గా పాల్గొన్న ఆయన కావలి టికెట్టు ఆశిస్తున్నట్లు పార్టీ అధిష్ఠానాన్ని కోరారు. అయితే, ఆశావహులు ఎక్కువవడంతో పార్టీ పెద్దలు లోతుగా అధ్యయనం చేశారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు, ఆయన సోదరుడిని పలుసార్లు పిలిపిం చుకొని మాట్లాడారు. అలాగే ఆశావహుల్లో ఒక్కరైన పసుపులేటి సుధాకర్‌ను రెండు రోజుల క్రితం పిలిపించుకొని కావలి టికెట్టు కాకుండా ప్రత్యా మ్నాయ మార్గాలు చూపారు. మాలేపాటి సోదరులతోనూ నేడో, రేపో చర్చించే అవకాశం ఉంది. ఇక అధిష్ఠానం నుంచి ఆదేశాలు అందిన వెంటనే ప్రజల్లోకి వెళ్లడానికి కృష్ణారెడ్డి అన్ని ఏర్పాట్లు చేసుకొంటున్నారు.

# పిల్లోడు కాదు.. పిడుగు!

### ఆదివారం ప్రత్యేకం

'లేదని దైర్యమా.. రానని నమ్మకమా.. నేనెక్కడున్నా నా అనుకున్నవాళ్ళు ఇక్కడుంటారు.' ఇది లెజెండ్ సినిమాలో బాలయ్య డైలాగ్. ఈ డైలాగ్ సినిమానే ఓ ఊపు ఊపేసింది. ఇదే డైలాగ్ వెంకటేష్ కళారంగం ఆరంగేట్రానికి తోడ్పడింది. ఇంతకీ ఎవరీ వెంకటేష్ అనుకుంటున్నారు. ఇప్పుడీ బుడతడి పేరు కళారంగం వెంకీగా మారిపోయింది. తాను అనుకున్నది సాధించి, ప్రముఖులు, పెద్ద పెద్ద స్టార్‌లతో నటించి, వారినుంచి మన్ననలు సంపాదించి ఎన్నో సన్మానాలు, సత్కారాలు, అవార్డులు అందుకున్నాడు. అలాంటి బుడతడు గురించి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

పిన్నవయసులోనే బుల్లి, వెండితెర కెక్కిన గడుగ్గాయ్

ఎంతోమంది ప్రశంసలు.. ఇంటినిండా అవార్డులే!



మనుబోలు, ఫిబ్రవరి 3 : మనుబోలు మండలం మడమనూరు గ్రామానికి చెందిన ఉప్పు చెంచయ్య, చంద్రక దంపతులకు చందన, వెంకటేష్ పిల్లలు ఉన్నారు. డ్రైవర్‌గా పని చేస్తూ చెంచయ్య కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వెంకటేష్ 5వ తరగతిలో ఉన్నప్పుడు అంటే 2019లో చెంచయ్య ఉన్న రేకుల ఇంట్లోకి జెముడు కాకి దూరింది. దీంతో ఇల్లు మూతవేసి నెల్లూరుకు వెళ్లిపోయారు. వెంకటేష్‌కు నటన, డ్యాన్స్ మీద ఆసక్తి ఉండటంతో నెల్లూరులోని డీజే డ్యాన్స్ అకాడమీలో చేర్చారు. అకాడమీలో డ్యాన్స్, ఇంట్లో తల్లి చంద్రిక అభినయంలో వెంకటేష్‌కు ఓనమాలు నేర్పింది. ఇటు నటన, అటు డ్యాన్స్‌తో బాగా ప్రావీణ్యం సంపాదించాడు. ఆటో నడుపుకుంటూ, పండ్ల వ్యాపారం చేస్తున్న చెంచయ్య తన కుమారుడికి షూటింగ్ అవకాశాలు వస్తుండటంతో 2022లో హైదరాబాద్ వలస వెళ్లాడు. అయితే, పెరిగిపోతున్న ఖర్చులను భరించలేక 2023లో తిరిగి తమ స్వగ్రామమైన మడమనూరుకు వచ్చేశారు.

● చదువుతో పాటు షూటింగ్‌లు

5వ తరగతిలో ఉన్నప్పుడు వెంకటేష్ డ్యాన్స్ అకాడమీలో చేరి శిక్షణ పొందారు. జీ తెలుగు చానల్ డ్రామా జూనియర్స్ ప్రోగ్రాం ఆడిషన్స్ కోసం వెంకటేష్‌ను వెంటబెట్టుకుని చెంచయ్య తిరుపతి వెళ్లాడు. అక్కడ నుంచి మరోమారు హైదరాబాదులో జరిగిన ఆడిషన్స్‌కి వెళ్లారు. ఆడిషన్స్‌లో నెగ్గిన తరువాత టీవీ చానళ్లలో ఈవెంట్లు, ప్రోగ్రామ్స్‌ను వెంకటేష్ చేసేవారు. షూటింగ్ సమయంలో బడికి డుమ్మా కొట్టే ఈ బుడతడు షూటింగ్ ముగియగానే ఆన్‌లైన్ క్లాసుల ద్వారా నేర్చుకునేవాడు. డ్రామా జూనియర్స్‌లో వెంకటేష్ నటనను తేజ చూసి ముగ్ధుడయ్యాడు. దీంతో తాను నటించిన 'హనుమాన్' చిత్రంలో ఓ పాత్రలో నటించేందుకు అవకాశం కల్పించినట్లు వెంకటేష్ తెలిపారు. బాగా చదువుకొని హీరో కావాలన్నదే తమ లక్ష్యమని అన్నారు.

● చేసిన ప్రోగ్రామ్స్

ఈటీవీలో జాతిరత్నాలు, జబర్దస్త్‌లో ఆది స్క్రిప్ట్‌లతో పాటు జీ తెలుగు చానల్‌లో డ్రామా జూనియర్స్, రామచక్కని సీత సీరియల్‌తోపాటు మాయాద్వీపంలో నటించాడు. ఈటీవీలో కార్తీక పౌర్ణమి ఈవెంట్, నెల్లూరు నెరజాణ సినిమాలో నటించారు. ఇటీవల బంపర్ హిట్ అయిన 'హనుమాన్' సినిమాలో వెన్నెల కిశోర్ క్యారెక్టర్ చేసి, మన్ననలు పొందుతున్నాడు. అలాగే సినీ హీరోయిన్ శ్రేయ తీస్తున్న మ్యూజికల్ మూవీలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటిస్తున్నాడు. ఈవెంట్, ప్రోగ్రాం, స్క్రిప్ట్ ఎందులోనైనా వెంకటేష్ తన ప్రతిభను చాటుతూ సన్మానాలు, సత్కారాలు అందుకున్నాడు. ఇటీవల మనుబోలు, సర్వేపల్లి ప్రాంతాలలో జరిగిన పలు ప్రాంతాలలో రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నుంచి సన్మానం అందుకున్నాడు.

### వాడి ఆశయం కోసం పోరాడుతా



మాది పేద కుటుంబం. డ్రైవింగ్ పని, పండ్ల వ్యాపారం చేసుకుంటూ రేకుల ఇంట్లో ఉంటున్నాం. వెంకటేష్ కోసం ఐదేళ్లుగా రూ.లక్షల్లో ఖర్చు చేశాను. వాడి ఆశయం కోసం ఎంతవరకైనా పోరాడతా. కష్టపడి మా అబ్బాయిని ఒకస్థాయికి తీసుకువస్తా.

- చెంచయ్య, వెంకటేష్ తండ్రి

# మేయర్ వర్సెస్ కమిషనర్

● ఫాగింగ్ డెమో వేదికగా బయటపడ్డ విభేదాలు

నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పోట్లూరి స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్‌ల మధ్య అంతర్గత విభేదాలు వెలుగుచూస్తున్నాయి. కార్పొరేషన్ కార్యాలయంలో ఇరువురి పేషీల మధ్య దూరం పెరుగుతోంది. సమీక్షలు, సమావేశాలు, పర్యటనలు, ప్రారంభోత్సవాలలో ఆచితూచి వ్యవహరిస్తున్న కమిషనర్ తన వద్దకు వస్తున్న అనేక రాజకీయ ఫైళ్లను సైతం తిరస్కరిస్తున్నారు. ప్రజా సమస్యలు, నగరాభివృద్ధిపై మౌనం వహిస్తున్న మేయర్ కేవలం రాజకీయ సభలు, సమావేశాలకే పరిమితమవుతుందన్న విమర్శలు మూటగట్టుకుంటోంది. తాజాగా కార్పొరేషన్ కార్యాలయంలో ఫాగింగ్ యంత్రాల డెమో వేదికగా ఇరువురి మధ్య విభేదాలు ఉన్నట్లు బహిర్గతమైంది.





నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 3 : నెల్లూరులో దోమల నివారణకు కమిషనర్ వికాస్‌మర్మత్ ఫాగింగ్ యంత్రాలను ఇటీవల కొనుగోలు చేశారు. ఇవి ఎలా పని చేస్తాయన్నది ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం డెమో ఇచ్చారు. వాటిని పరిశీలించిన కమిషనర్ వెంటనే వాటిని వినియోగించాలని ఆరోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఈ విషయం తమకు సమాచారం ఇవ్వలేదని గ్రహించిన మేయర్ స్రవంతి పోటీగా శనివారం మరోసారి తనదైన శైలిలో ఫాగింగ్ యంత్రాల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. దీంతో ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేసిన కమిషనర్ ఇంజనీరింగ్ అధికా రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేయర్ పరిశీలన అయ్యే వరకు ఆయన కమాండ్ కంట్రోల్ భవనంలోనే ఉండిపోయారు. ఆమె వెళ్లిపోయాక బయటకు వచ్చిన కమిషనర్ అక్కడే మరో కార్యక్రమంలో పాల్గొ న్నారు. ఫాగింగ్ యంత్రాలను తమకు తెలియకుండా ఎలా ప్రారంభిస్తారని, వాటిని తన అనుమతి లేకుండా ఆరోగ్య విభాగానికి ఎలా అప్పగిస్తా రంటూ ఎస్ఈ సంపత్‌కుమార్‌పై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇలా మేయర్, కమిష నర్‌ల మధ్య విభేదాలు క్రమేణా వెలుగు చూస్తున్నాయి. ఇద్దరి చాంబర్ల ఆధునికీకరణ, నగరంలో పర్యటన వివరాలు మీడియాకు తెలియజేయడం ఇలా అంశాలపై వారి మధ్య పొసగడం లేదని కార్యాలయ ఉద్యోగులు గుసగుస పోతున్నారు.



ఖోఖో విజేతలకు బహుమతులు ఇస్తున్న మంత్రి కాకాణి, తదితరులు

## ముగిసిన 'ఆడుదాం ఆంధ్రా'!

● జిల్లా విజేతలకు బహుమతుల పంపిణీ

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 3 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శనివారం సాయంత్రం ఆడుదాం ఆంధ్రా జిల్లాస్థాయి పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో ఆత్మకూరు ప్రథమస్థానం, సర్వేపల్లి ద్వితీయ, నెల్లూరు రూరల్ తృతీయ స్థానాలు సాధించాయి. మహిళల విభాగంలో నెల్లూరు రూరల్, కావలి, కందుకూరు వరుస స్థానాలు సాధించాయి. ఇక క్రికెట్ పురుషుల విభాగంలో కోవూరు, ఉదయగిరి, సర్వేపల్లి జట్లు, మహిళల విభాగంలో సర్వేపల్లి, కావలి, కోవూరు వరుస స్థానాలను దక్కించుకున్నాయి. ఖోఖో పురుషుల విభాగంలో కోవూరు, నెల్లూరు రూరల్, కావలి జట్లు, మహిళల విభాగంలో నెల్లూరు రూరల్, కందుకూరు, కావలి, కబడ్డీ పురుషుల విభాగంలో కోవూరు, కందుకూరు, ఆత్మకూరు, మహిళల విభాగంలో కందుకూరు, కోవూరు, కావలి జట్లు వరుసగా మూడుస్థానాలు దక్కించుకున్నాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో కోవూరు, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ జట్లు, మహిళల విభాగంలో కోవూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్ జట్లు గెలుపొందాయి. విజేతలకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ బహుమతులు అందచేశారు. మంత్రి కాకాణి మాట్లాడుతూ జిల్లాస్థాయి లో రాణించిన క్రీడాకారులందరూ విశాఖలో ఈ నెల 9 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలని సూచించారు. అలా గే జిల్లాకు చెందిన అంతర్జాతీయ క్రీడాకారులు కె.తులసి (వెయిట్ లిఫ్టర్), సురేష్, మహేష్‌బాబు (కబడ్డీ), ప్రకాష్( ఫుట్‌బాల్), లక్ష్మీ నారాయణ (ఖోఖో)లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ స్రవంతి, కమి షనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఎస్ డీఓ ఆర్‌కె. యతిరాజ్, అదనపు కమిషనర్ శర్మద, ఆర్డీఓ మలోల, డీఎస్‌ఏ కార్యాలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## జిల్లాలో తహసీల్దార్లకు పోస్టింగ్‌లు

నెల్లూరు (హరనాథపురం): సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా జిల్లాకు కేటాయించిన తహసీల్దార్లకు పోస్టింగ్‌లు కేటాయిస్తూ కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

| మండలం | తహసీల్దారు |
|---|---|
| నెల్లూరు నగరం | బి.వెంకటేశ్వర్లు |
| నెల్లూరు రూరల్ | జీవీ.సుబ్బారెడ్డి |
| కోవూరు | జి.విజయశ్రీ |
| బుచ్చిరెడ్డిపాళెం | పి. సురేష్‌బాబు |
| ఇందుకూరుపేట | పి.సునీత |
| టీపీ గూడూరు | కె.మాధవరెడ్డి |
| ముత్తుకూరు | ఎల్.బాలకృష్ణ |
| వెంకటాచలం | ఎం.పూర్ణచంద్రరావు |
| మనుబోలు | కె. చిరంజీవి |
| పొదలకూరు | వీరవసంతరావు |
| రాపూరు | బి.వెంకటస్వామి |
| సైదాపురం | టి. ప్రవీణ్‌కుమార్ |
| ఆత్మకూరు | ఎస్.శివనాగిరెడ్డి |
| చేజర్ల | కె.గోపికృష్ణ |
| ఏఎస్‌పేట | కె.రవికుమార్ |
| మర్రిపాడు | పి.సీతారత్నం |
| సంగం | బి.రమాదేవి |
| అనంతసాగరం | పి.నరసింహారావు |
| ఉదయగిరి | కె. నెహ్రూబాబు |
| సీతారాంపురం | ఎవీ కృష్ణారెడ్డి |
| కలువాయి | సీహెచ్ శ్రీనివాసరావు |
| కావలి | కె.నగేష్ |
| బోగోలు | ఎం. క్షమారాణి |
| అల్లూరు | ఎన్. దుర్గేశ్వరరావు |
| దగదర్తి | పి. జాన్‌పీటర్ |
| జలదంకి | ఎన్. వాసు |
| కలిగిరి | బాలకిషోర్ |
| దుత్తలూరు | ఎస్. వెంకటరత్నం |
| కొడవలూరు | పి.శైలేంద్రకుమార్ |
| విడవలూరు | ఎస్‌కే ఇస్మాయిల్ |
| వింజమూరు | ఎంవీ కృష్ణారెడ్డి |
| కందుకూరు | పి.కృష్ణకాంత్ |
| గుడ్లూరు | ఏవీ రమణ |
| లింగసముద్రం | జి. శ్రీచరణ్ |
| ఉలవపాడు | కె. రవిబాబు |
| వలేటివారిపాలెం | ఎన్. నాగమల్లేశ్వరరావు |
| కొండాపురం | డి. శ్రావణ్‌కుమార్ |
| వరికుంటపాడు | ఏవీపీ చంద్రారెడ్డి |
| నెల్లూరు డీఏట | కె. సంజీవరావు |

ఎల్ఏ స్పెషల్ తహసీల్దారు బి.సుశీల
కలెక్టరేట్ స్పెషల్ తహసీల్దార్ (ఎల్ఆర్) ఎం.రాజ్యలక్ష్మీ
కలెక్టరేట్ తహసీల్దార్ నెల్లూరు-(కోఆర్డినేషన్) పి. సుబ్రహ్మణ్యం

# ఇంటర్ ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం

● రేపటి నుంచి సీసీ కెమెరాల నీడలో నిర్వహణ

● ఫిర్యాదులపై కఠిన చర్యలు : ఆర్ఐవో

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 3 : ఇంటర్మీడియట్ ప్రయోగ (ప్రాక్టికల్స్) పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు చేశామని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 20వతేదీ వరకు మూడు దశల్లో ఒకేషనల్, 11 నుంచి 20వతేదీ వరకు జనరల్ సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 1954 మందికి 25 కేంద్రాల్లో, జనరల్ సైన్స్‌లో 19,389 మంది పరీక్షలకు హాజరవుతున్నారని అన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరా లను ఏర్పాటు చేశామని, వీటిని ఇంటర్‌బోర్డు అధికారులు నిత్యం పరిశీలిస్తుంటారని చెప్పారు.

● నిర్వహణకు డీఈసీ కమిటీ

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ)ని నియమిస్తూ ఇంటర్‌బోర్డు కార్యదర్శి సౌరబ్‌గౌర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆర్ఐఓ కన్వీనర్‌గా, సభ్యులుగా ప్రిన్సిపాళ్లు బిడి.దీనదయాళ్, పి.వేణుగోపాల్, అధ్యాపకులు కె.కొండయ్య ఉంటారని అన్నారు. అలాగే ప్రత్యేక అధికారిగా డీవీఈఓ కె.మధు బాబు, ఒకేషనల్ కోర్సుల పర్యవేక్షకులుగా అధ్యాపకులు డి.ఆదినారాయణ, జిల్లా స్ట్రాంగ్‌రూమ్ ఇన్చార్జిగా ఫిజికల్ డైరెక్టర్ పి.వేణుగోపాల్‌రెడ్డి నియమితులైనట్లు తెలి పారు. 400 మంది ఎగ్జామినర్లు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్స్, హైపవర్ కమిటీ, డీఈసీ సభ్యులను నియమించామన్నారు. పరీక్షలు జరిగే కళాశాలల్లోని ల్యాబ్‌లను ఇప్పటికే పరిశీలించినట్లు తెలిపారు.

● సీసీ కెమెరాల నిఘా

ఎన్నడూ జరగని రీతిలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించేలా సన్నాహాలు చేశామని, కార్పొరేట్‌లకు కళ్లెం వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆర్ఐవో తెలిపారు. అవకతవకలు జరిగినా, ల్యాబ్‌ల నిర్వహణ సరిగా లేకున్నా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పరీక్షల పేరుతో కొన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల వద్ద నుంచి అనధికార వసూళ్లకు పాల్పడతున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు స్పష్టం చేశారు. అలాగే ఈ ఏడాది పరీక్ష పూర్తయిన వెంటనే ఎప్పటికప్పుడు మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారని తెలిపారు. కాగా, శనివారం) నిర్వహించాల్సిన పర్యావరణ విద్య పరీక్షను కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీఈసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐవో శ్రీనివాసులు, తదితరులు

## జిల్లావ్యాప్తంగా రెవెన్యూ వర్గాల నిరసన

### కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

# తహసీల్దారు హత్యపై గరం గరం

నెల్లూరు (హరనాథపురం); ఫిబ్రవరి 3 : భూ వివాదాల కారణంగా విశాఖలో తహసీల్దారు రమణయ్యను హత్య చేయడాన్ని ఖండిస్తూ శనివారం జిల్లావ్యాప్తంగా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. నెల్లూరులోని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి డానియర్ పీటర్‌రావు తదితరులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పెంచల రెడ్డి మాట్లాడుతూ తహసీల్దారు రమణయ్య హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అధిక భూ వివాదాలు ఉన్న మండలాల్లో తహసీల్దార్లకు ప్రత్యేక రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని మండలాల తహసీల్దారు కార్యాలయాలతోపాటు కలెక్టరేట్ వద్ద కూడా ఉద్యోగులు ఆందోళన చేశారు.



నెల్లూరు : తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



వెంకటాచలం తహసీల్దారు కార్యాలయం ఎదుట...



కలెక్టరేట్‌లో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

## వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

● అపహరించిన నగలు స్వాధీనం

సంగం, ఫిబ్రవరి 3: మండలంలోని తలుపూరుపాడులో షేక్ మస్తాన్ బీ హత్య కేసులో నిందితుడు షేక్ అన్సర్‌బాషాను శనివారం సంగం పోలీసులు బుచ్చిరెడ్డిపాళెంలో అరెస్ట్ చేశారు. నిందితుడు అపహరించి కుదువ పెట్టిన బంగారు నగలను స్వాధీనం పరుచుకున్నారు. ఈమేరకు సంగంలోని సీఐ కార్యాలయంలో డీఎస్పీ కోటారెడ్డి ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడించారు. ఈ నెల 27వ తేదీన తలుపూరుపాడు గ్రామంలోని షేక్ మస్తాన్ బీ హత్యకు గురైన విషయం ఆదివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. మృతురాలి ఒంటిపై ఉన్న 8 సవర్ల బంగారు నగలు మాయమవడంతో స్థానిక వ్యక్తి అన్సర్ బాషాపై అనుమానంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం నిందితుడు అన్సర్‌బాషా బుచ్చిరెడ్డిపాళెం బస్టాండ్‌లో సంచరిస్తుండగా పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడు చెడు వ్యసనాలకు బానిసై అప్పుల పాలయ్యాడు. ఎలాగైనా డబ్బులు సంపాదించి అప్పులు తీర్చుకోవాలని భావించి ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తన ఇంటికి సమీపంలో ఉన్న మస్తాన్ బీ ఇంట్లోకి వెళ్లి నిద్రిస్తున్న ఆమె ముఖంపై దిండుతో అదిమిపట్టి గొంతు నులిమి హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను అపహరించి పరారయ్యాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసిన సీఐ రవినాయక్, ఎస్‌ఐ నాగార్జునరెడ్డిలు పరారీలో ఉన్న నిందితుడ్ని అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. కాగా, ఈ కేసులో ప్రతిభ కనబరిచి నిందితుడ్ని అరెస్ట్ చేసిన సీఐ రవినాయక్, ఎస్‌ఐ నాగార్జునరెడ్డిని అభినందించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు నిందితుడిని పట్టుకున్న పోలీసులకు రివార్డులు అందచేశారు.



ప్రెస్‌మీట్‌లో నిందితుడిని హాజరుపరిచిన పోలీసులు



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వృద్ధురాలి బంగారు నగలు

## చెడువ్యసనాలకు బానిసలై దొంగలుగా మారి..



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 3: వరుసకు అన్నదమ్ముళ్లు అయిన ఆ ఇద్దరూ మద్య, గుట్కాలు వంటి చెడు వ్యసనాలకు బానిలై ఖర్చుల కోసం దొంగలుగా మారి చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యారు. శనివారం దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో నిందితుల వివరాలను స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎండీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ విలేకర్లకు వివరించారు. నగరంలోని జీజీహెచ్ ఎదురుగా షేక్ అనిల్ దిల్దార్ అనే వ్యక్తి చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయం నిర్వహిస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 2వ తేదీన గుర్తుతెలియని దుండగలు చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయం తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి రెండు ల్యాప్‌టాప్‌లు అపహరించుకు వెళ్లారు. బాధితుడు ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎండీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, ఎస్‌ఐ బీ రమేష్‌బాబులు సిబ్బందితో సాంకేతిక కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. నెల్లూరు నగరం మూలాపేట, నీలగిరి సంఘంకు చెందిన షేక్ ఫ్రక్రుద్దీన్, కొత్తూరు చౌటమిట్టకు చెందిన షేక్ రఫిలను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా రెండు ల్యాప్‌టాప్‌లతో పాటు మరో రెండు మోటారు సైకిళ్లను దొంగతనం చేసినట్లు నిందితులు అంగీకరించారు. దీంతో నిందితుల నుంచి రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు మోటారు సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చిన్నబజారు, వేదాయపాలెం, బుచ్చిరెడ్డిపాలెం పోలీసు స్టేషన్లలో హత్య, హత్యాయత్నం, పలు దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## రెండు లారీల పట్టివేత

కావలి, ఫిబ్రవరి 3: పర్మిట్లు లేకుండా జామాయిల్ కర్రతో వెళుతున్న రెండు లారీలను శనివారం ఉదయం కావలి రూరల్ మండలం గౌరవరం వద్ద సోషల్ ఫారెస్ట్ ఆర్ఎం సందీప్ పట్టుకున్నారు. కావలి సోషల్ ఫారెస్ట్ కార్యాలయ సందర్శనకు వస్తున్న ఆయన గౌరవరం వద్ద ఆగి ఉన్న లారీలను తనిఖీ చేశారు. వాటిలో జామాయిల్ కర్ర ఉండటం చూసి, బిల్లులేవని అడిగారు. వారి నుంచి సమాధానం లేకపోవటంతో ఆ రెండు లారీలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కావలి సోషల్ ఫారెస్ట్ కార్యాలయంలో వాటిని అప్పగించారు. తదుపరి విచారించగా అన్నగారిపాలెం వీఎస్ఎస్ నుంచి ఆ కర్రను తీసుకువెళుతున్నట్లు చెప్పారు. రేంజరు మోహన్‌రావు సిబ్బందితో వచ్చి పర్మిట్లు చూపించారు. దీంతో లారీలను వదిలివేశారు.



పట్టుబడిన జామాయిల్ కర్ర లారీలు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, ఫిబ్రవరి 3: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని కనుపూరు సమీపంలో ఉన్న మలుపు వద్ద శనివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నగరానికి చెందిన జావేద్, ఇబ్రహీం ఇద్దరూ కలిసి మోటార్‌బైక్‌పై కసుమూరు దర్గాలో దైవదర్శనం చేసుకుని తిరిగి నెల్లూరు వెళ్తుండగా కనుపూరు దాటిన తర్వాత మలుపు వద్ద ఎదురుగా కంకర టిప్పర్ ఒక్కసారిగా రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడడంతో వారిని సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

## మద్యం స్వాధీనం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 3: నగరంలోని ఎస్‌వీజీఎస్ కళాశాల వద్ద ఓ వ్యక్తి వద్ద మద్యం సీసాలు ఉండడాన్ని గుర్తించి బాలాజీనగర్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎల్ వీరానాయక్ తమ సిబ్బందితో శనివారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎస్‌వీజీఎస్ కళాశాల వద్ద కోదండరామపురంకు చెందిన కొల్లి లక్ష్మయ్య వద్ద 11 క్వార్టర్ మద్యం సీసాలు గుర్తించారు. ప్రభుత్వ లైసెన్సు కాని, అనుమతులు లేకుండా చట్ట విరుద్ధంగా మద్యం సీసాలు కలిగి ఉండటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 125 |
| లేయర్ లైవ్ | 85 |
| స్కిన్ చికెన్ | 224 |
| స్కిన్‌లెస్ | 250 |
| లేయర్ | 145 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 5994 |
| వెండి కిలో ధర | రూ. 73,000 |
| వెండి ఒక గ్రాము | రూ. 75.00 |

## మెగా కాదు.. దగా డీఎస్సీ!

నెల్లూరు(వ్యవసాయం) : రాష్ట్ర ప్రభుత్వం వదిలింది మెగా డీఎస్సీ కాదని, దగా డీఎస్సీ అని తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 50,892 ఖాళీలుంటే కేవలం 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వంశించడమేనని చెప్పారు. ఎన్నికల సమయంలో డీఎస్సీ పేరుతో మరోసారి నిరుద్యోగుల్ని వంచించేందుకు సీఎం జగన్ సిద్ధమయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నాలుగేళ్ల జగన్ చేసింది ఏమీ లేదని, ఎన్నికలు రాబోతుండడంతో డ్రామాలు ఆడుతున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గీతాకృష్ణ, శ్రీకుమార్, కటకం చైతన్య, పరదేశి, మణికంఠ, మహేష్, ప్రసాద్, తరుణ్‌తేజ్‌రెడ్డి, అఖిల్, సునీల్‌కుమార్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యాన్ని కబళిస్తున్న కేన్సర్

నేడు ప్రపంచ కేన్సర్ డే

- 'రొమ్ము' వ్యాధిగ్రస్థులే అధికం
- సర్వైకల్, నోటి కేన్సర్లపై జాగ్రత్తగా ఉండాలి
- పొగాకు ఉత్పత్తుల వాడకంతో ప్రమాదం
- జిల్లాలో 19 వేల మందికి పైగా నమోదు

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 3 : కేన్సర్.. ఈ వ్యాధి వచ్చిందంటే ఇక తాము బతకమనే భయం మనిషిని పీడిస్తోంది. దీనికి ప్రధాన కారణం ఎక్కువగా కేన్సర్ మరణాలు సంభవించటమే. ప్రపంచ ఆరోగ్య సంస్థ కేన్సర్ విభాగం రూపొందించిన గణాంకాలు దీనిని నిర్ధారిస్తున్నాయి. జిల్లాలోనూ ఈ పరిస్థితి ఉంది. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించలేకపోవడం, సకాలంలో సరైన వైద్యం అందక బాధితులు మృత్యువాత పడుతున్నారు. ఈ వ్యాధిపై సరైన అవగాహన లేని వారు సాధారణ వైద్యంతో సరిపెట్టుకుంటూ తీరా ప్రాణాపాయ స్థితికి చేరుకునేసరికి రూ.లక్షల్లో ఖర్చు చేసినా జబ్బును నయం చేసుకోలేని పరిస్థితి. నేటి ఆధునిక సమాజంలో పలు అలవాట్లు కారణంగా ఈ వ్యాధి మహమ్మారిలా వ్యాపించి ఆరోగ్యవంతులన్ని సైతం కబళించివేస్తోంది. గతంలో 50 ఏళ్ల పైబడిన వారికి వచ్చే కేన్సర్ వ్యాధి నేడు ధూమం, మద్యపానంకు ఎక్కువగా ఆకర్షితులవుతున్న యువత నోటి, ఊపిరితిత్తుల కేన్సర్ బారీన పడుతోన్నారు. మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్(వక్షోజాలు) బాధితులు 27 శాతం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గర్భాశయ ముఖద్వార కేన్సర్ బాధితులు 18 శాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఫిబ్రవరి 4వ తేదీని ప్రపంచ కేన్సర్ డేగా నిర్ధారించింది.

### జిల్లాలో 19 వేల మందికి పైగా...

జిల్లాలో ప్రస్తుతం 19 వేల మందికి పైగా ఉన్న కేన్సర్ రోగులు ఉన్నారు. వీరంతా వ్యాధి రెండో దశకు చేరుకున్న వారే. నిర్ధారణ పరీక్షలు చేయించుకోకుండా మరెంత మంది ఉన్నారో వ్యాధిగ్రస్తుల్లో ఎక్కువ శాతం మహిళల్లో రొమ్ము కేన్సర్ బాధితులే. అలాగే గుట్కా, ఖైనీ, జరదా వంటి మత్తు పదార్థాల అలవాటు ఉన్నవారు ఎక్కువగా ఉండడంతో నోటిలో దవడ, నాలుక, స్వరపేటిక కేన్సర్ బాధితుల సంఖ్య ఏడాదికే దాడి పెరుగుతూనే ఉంది. ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై వీటి వల్ల కేన్సర్ వస్తుందంటూ ప్రచారానికే రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా సరైన నియంత్రణ విధానాలు లేక పోవడంతో కేన్సర్ బాధితుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. అలాగే వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా సురక్షితం గాని లైంగిక సంబంధాల వల్ల మహిళల్లో గర్భాశయ ముఖద్వారం కేన్సర్ బాధితులు పెరుగుతున్నారు.

### కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి. ప్రత్యేకించి మహిళలు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ బాధితులు నమోదవుతున్నారు. దీంతో మహిళలు కనీసం ఏడాదికి ఒకసారైనా బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. సర్వైకిల్, లివర్ కేన్సర్‌లకు ప్రత్యేకించి వ్యాక్సిన్ ఉంది. ఇది వేసుకుంటే ఎంతో మంచిది. దీనిపై ప్రజలలో అవగాహన పెరగాలి. 13 నుంచి 14 ఏళ్ల వయస్సున్న యువతులు మూడు నెలల్లో రెండు దఫాలు వ్యాధి నిరోధక ఇంజక్షన్ వేయించుకుంటే భవిష్యత్తులో గర్భాశయ కేన్సర్ రాదు.

- డాక్టర్ గీత ఉషశ్రీ, కేన్సర్ వైద్య నిపుణురాలు, (ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి)

### కార్యరూపం దాల్చని లినాక్ బంకర్ నిర్మాణం

నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధికి రూ.4కోట్లతో కేన్సర్‌కు ప్రత్యేక యూనిట్‌తో పాటు లినాక్ బంకర్ నిర్మాణం చేపడతున్నామని రెండేళ్ల నుంచి చెబుతున్నారే గానీ అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ విభాగంలో ప్రతి ఏటా 5 వేల మందికి పైగా రెడ్ క్రాస్ వైద్య సేవలు అందిస్తుంది. అలాగే మెడికవర్ ఆసుపత్రిలో కూడా కేన్సర్‌కు ప్రత్యేక విభాగం ఉంది. జిల్లా నుంచి పెద్దసంఖ్యలో హైదరాబాద్‌లో ఉన్న బసవతారకం కేన్సర్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. తిరుపతిలో స్విమ్స్ ఆసుపత్రి కూడా కొంత వరకు కేన్సర్ రోగులకు సేవలు అందిస్తున్నాయి. అయితే జిల్లాలోని కేన్సర్ వ్యాధిగ్రస్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఎంతో మంది కేన్సర్ కారణంగా మృత్యువాత పడుతున్నారు.

## వీఆర్ఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి

● వీఆర్ఏల సంఘం గౌరవాధ్యక్షుడు పెంచలనర్సయ్య

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 3 : గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ)కు కనీత వేతనం రూ.26వేలు ఇవ్వాలని వీఆర్ఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనర్సయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నామినీలుగా పని చేస్తున్న వీఆర్ఏలను ప్రభుత్వం గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయ, వలంటీర్లు వ్యవస్థలను తీసుకువచ్చినా వీఆర్ఏల పనిభారం మాత్రం తగ్గలేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూసర్వే, కుల గణన వంటి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల పాదయాత్రలో వీఆర్ఏల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన జగన్ ఆ హామీలను విస్మరించారన్నారు. వీఆర్ఏల సమస్యలను పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ వీఆర్ఏలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 డీఏ పెంచుతూ జీవో జారీ చేసిందన్నారు. అయితే 2018లో ఇచ్చిన డీఏను వైసీపీ ప్రభుత్వం రికవరీ చేసిందని, నేటికీ ఆ డబ్బులు తిరిగి ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నేతలు జలీల్‌బాషా, ఖాదర్‌బాషా, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న పెంచలనరసయ్య

## 10లోగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి : జేసీ

కావలి రూరల్, ఫిబ్రవరి 3: లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లను ఈనెల 10వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. కావలి పట్టణ ముసునూరు, మండలంలోని గౌరవరం సచివాలయాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల తీరును పరిశీలించారు. సచివాలయ సిబ్బంది విధులకు సకాలంలో హాజరవుతున్నారా.. లేదా? అని ఆరా తీశారు. రిజిస్ట్రేషన్లను గడువులోపు పూర్తి చేయాలని ఆర్డీవో శీనానాయక్, తహసీల్దార్ మాధవరెడ్డి, ఎంపీడీవో ఏవీ. క్రిష్ణమోహన్, ఈవోపీఆర్డీ మహేశ్వరిలకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, మండల స్థాయి అధికారులు ఉన్నారు.



రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న జేసీ ఆర్డీవో

## 8, 9 తేదీలలో ట్రెజరీ ఉద్యోగుల క్రీడా పోటీలు


నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 3 : ఈనెల 8, 9 తేదీలలో ట్రెజరీ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ పోటీలు ఈనెల 5, 6 తేదీలలో నిర్వహించాల్సి ఉందని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులకు అత్యవసర కార్యక్రమాలు ఉన్నందున ఈ పోటీలను ఈనెల 8, 9 తేదీలలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఉద్యోగులందరూ గుర్తించి అదనంగా వచ్చిన సమయాన్ని ప్రాక్టీసు కోసం ఉపయోగించుకుని క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

### నేడు బాధ్యతలు స్వీకరించనున్న జడ్పీ సీఈవో

నెల్లూరు(జడ్పీ), ఫిబ్రవరి 3 : నెల్లూరు జిల్లా పరిషత్ సీఈవోగా కన్నమనాయుడు ఆదివారం బాధ్యతలు స్వీరించనున్నారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా జరిగిన బదిలీల్లో ఇన్‌చార్జి సీఈవో చిరంజీవిని డిప్యూటీ సీఈవోగా కొనసాగిస్తూ విజయవాడలోని పంచాయతీరాజ్ కమిషనరేట్‌లో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న కన్నమనాయుడుని జడ్పీ సీఈవోగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన శనివారం నెల్లూరుకు వచ్చి జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆమె సీఈవోకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సభ్యుడిగా డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 3 : ప్రముఖ వైద్యుడు సీవీ సుబ్రహ్మణ్యంకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖలో నామినేటెడ్ పదవి దక్కింది. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ సభ్యుడుగా నియమిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడం కోసం నూతన కమిటీని నియమించిందని తెలిపారు. ఈ కమిటీకి ఛైర్మన్‌గా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ఉంటారని, రాష్ట్రం నుంచి ఇద్దరిని సభ్యులుగా నియమించగా అందులో తనను నియమించినట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ నెల్లూరు అధ్యక్షుడుగా, జయభారత్ ఆసుపత్రి కమిటీ సభ్యుడుగా ఉన్న తనకు సహకరించిన సంఘ్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను ప్రజల కోసం వినియోగిస్తామని తెలిపారు.



డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం

## పాడైపోయిన కోడిగుడ్లు తిని అనారోగ్యం

విడవలూరు, ఫిబ్రవరి 3: ధర తక్కువ... పెద్ద సైజుగా ఉన్నాయని మండలంలోని కడనూతల గ్రామస్థులు కోడిగుడ్లు కొనుగోలు చేశారు. వాటిని కూర చేసుకుని తిన్నాక వారు అనారోగ్యానికి గురయ్యారు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో ఆరు రూపాలయలకే కోడిగుడ్డే.. పెద్దసైజు గుడ్లంటూ శుక్రవారం ఆటో ఓ వ్యక్తి వచ్చి జోరుగా వ్యాపారం చేశాడు. వాటిని స్థానికులు భారీగానే కొనుగోలు చేశారు. హడావిడిగా అమ్మేసుకున్న వ్యాపారి అక్కడి నుంచి జారుకున్నాడు. వాటిని కొనుగోలు చేసినవారు ఉడకపెట్టి కూర చేసుకుని తిన్నారు. వెంటనే వారికి వాంతులు, విరోచనాలు, కడుపు నొప్పి రావడంతో ఆసుపత్రులకు పరుగులు తీశారు. పాడైపోయిన కోడిగుడ్లు తినడం వల్లే ఇలా జరిగిందని వారు వాపోయారు.



కడనూతలలో కొనుగోలు చేసిన పాడైపోయిన కోడిగుడ్లు

## నల్లచట్టం వల్ల అన్నీ నష్టాలే..! : బార్ కౌన్సిల్ మెంబరు

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన నల్లచట్టం (ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్-2022) వల్ల ప్రజలకు అన్ని విధాలుగా నష్టాలేనని రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం నెల్లూరులోని జేవీకే మెమోరియల్ ఆసుపత్రిలో న్యాయవాదుల ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భూముల విలువ పెరిగే కొద్ది భూతగాదాలు కూడా పెరిగిపోతున్నాయన్నారు. ఈ తరుణంలో భూయజమానులు కోర్టుకు వెళ్లే వీలు లేకుండా అధికారులకే సర్వాధికారాలు ఇస్తూ భూహక్కు చట్టం తీసుకురావడం దారుణమన్నారు. ఈ చట్టం ప్రజలకు మేలు చేసేది కాదని, ప్రజల హక్కులను కాలరాసేదిగా ఉందని చెప్పారు. ఈ చట్టం వల్ల భవిష్యత్తులో ఏర్పడే ఇబ్బందులు అన్ని ఇన్ని కావన్నారు. ప్రజలు, ప్రజా సంఘాలు రాజకీయ పక్షాలు మేల్కొని ఈ చట్టం అమలులోకి రాకుండా చూడాలని కోరారు. మరో మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా భూవివాదాల పరిష్కారం బాధ్యత రెవెన్యూ యంత్రాంగం చేతిలో పెట్టడం వల్ల ప్రజలకు మేలుకంటే కీడే ఎక్కువ జరుగుతుందన్నారు. ఈ చట్టం వల్ల ప్రజల అస్తులకు రక్షణ లేకుండా పోతుందని పేర్కొన్నారు. టీడీపీ పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక ఈ చట్టాన్ని శాశ్వతంగా రద్దు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐలు జాతీయ కార్యవర్గ సభ్యుడు బీవీ రమణారెడ్డి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సుందరయ్య యాదవ్, ఉద్యమ కమిటీ కన్వీనర్ ఎం. బ్రహ్మం, సభ్యులు బద్దెపూడి రవీంద్ర, కే విజయమోహన్‌రెడ్డి, చుక్కా రమేష్, సీనియర్ న్యాయవాదులు ఓ.అబ్బాయిరెడ్డి, జక్కా శేషమ్మ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సుంకర రాజేంద్ర ప్రసాద్, వేనాటి చంద్రశేఖర్

## తుది జాబితాలోనూ అదే నిర్లక్ష్యం

● యథాతథంగా డబుల్ ఎంట్రీలు, డెత్‌లు ● మార్పులకు నోచని లిస్టు.. ప్రతిపక్షాల ఆగ్రహం

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 3 : బుచ్చి నగర పంచాయతీతోపాటు మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్ల జాబితా సవరణలకు ఇప్పటికే ఎన్నికల కమిషన్ రెండుసార్లు అవకాశం కల్పించింది. అయినా అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ జాబితాలో డెత్‌లు, డబుల్ ఎంట్రీలు తొలగించలేదు. బీఎల్‌వోలు పరిశీలించి చేసిందేమిటని ఓటర్లు, పార్టీల నాయకులు అధికారులను ప్రశ్నించినా ప్రయోజనం కనిపించలేదు.

### ఈసీ ఆదేశాలు పట్టవా!?



ఓటరు జాబితాల సవరణలపై ఎన్నికల కమిషన్ ఆదేశాలు అధికారులకు పట్టవా!? మండలంలో బీఎల్వోల ద్వారా వెరిఫికేషన్ చేశామని అధికారులు చెప్పడం తప్ప ప్రతి బూత్ పరిధిలో వందల సంఖ్యలో డెత్‌లను, డబుల్ ఎంట్రీలున్నా పురోగతి లేదు. టీడీపీకి అనుకూల ఓట్లను తొలగించడం, వైసీపీకి అనుకూల ఓట్లు చేర్చి పక్షపాతం ప్రదర్శించారు. ప్రతి బూత్ పరిధిలో వందల సంఖ్యలో డెత్‌లను, డబుల్ ఎంట్రీలున్నా నేటికీ సవరించలేద న్నారు. సవరణలు చేయకపోతే చట్టపరంగా పోరాటం చేస్తామన్నారు.

- ఎంవీ.శేషయ్య టీడీపీ మండలాధ్యక్షుడు

### ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!

ఎన్నికల కమిషన్ ఇప్పటికి 2సార్లు ఆదేశించినా ఓటరు జాబితాలలో ఎలాంటి మార్పులూ లేవు. డెత్‌లు, డబుల్ ఎంట్రీలు ఎక్కడివక్కడే ఉన్నాయి. కొత్త ఓటరు నమోదుకూ దిక్కులేదు. ఒకే ఇంట్లోని ఓట్లు వేర్వేరు బూత్‌లలో ఉన్నా పట్టించుకోవడంలేదు. ఓటర్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. ఇంత నిర్లక్ష్యం ఎందుకో అర్థం కావడంలేదు. ఎన్నికల కమిషన్ చొరవ తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలి.

- కాసా శ్రీనివాసులు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

## నకిలీ సైకాలజిస్టులు ఉన్నారు జాగ్రత్త

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 3 : అర్హత లేకపోయినా తాము సైకాలజిస్టులమంటూ పలువురు చెలామణి అవుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైకాలజిస్టు అసోసియేషన్ ప్రొఫెసర్ పీవీ రెడ్డి తెలిపారు. శనివారం జర్నలిస్టు భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సైకాలజిస్టులంటే ఎవరు, వారి పాత్ర ఏమిటి, సైకాలజిస్టులను గురించి చట్టం ఏమి చెబుతోంది తదితర అంశాలు వివరించారు. ఒకవేళ తాము సైకాలజిస్టులని తెలిపినా, ప్రజలు వారి విద్యార్హతలు, అనుభవం, లైసెన్స్ ఏ సంస్థల నుంచి పట్టా పొందారు.. తదితర విషయాలు తప్పకుండా పరిశీలించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలలో వసతులు లేక విద్యార్థుల అవస్థలు

● అర్ధంతరంగా నిలిచిన నాడు-నేడు పనులు



ప్రహరీకి నోచుకోని భోగ్యంవారిపల్లి ప్రాథమిక పాఠశాల

**వరికుంటపాడు, ఫిబ్రవరి 3:** కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగిస్తున్నామని గొప్పలు చెప్పే ప్రభుత్వ మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. రూ. కోట్లల్లో నిధులు వెచ్చిస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం ఆశించిన మేర ఫలితాలు సాధించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు నిదర్శనమే మండలంలోని భోగ్యంవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏళ్ల తరబడి ముందుకు సాగక నిలచిన నాడు-నేడు పనులు. ఆ పాఠశాలకు 2021-22 విద్యా సంవత్సరంలో రెండో విడత పథకం కింద రూ. 18లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ప్రహరీ, టైల్స్‌, మరుగుదొడ్డి, విద్యుత్‌, ఇతరత్రా మరమ్మతు పనులతో పాటు తాగునీటి బోరు ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించాల్సి ఉంది. అయితే అప్పటి నుంచి అధికారుల అలసత్వమో లేక రాజకీయ గ్రహణమో ఏమోగానీ పనులకు మాత్రం అవరోధాలు ఏర్పడడంతో ప్రతినిత్యం విద్యార్థులు సమస్యల వలయంలోనే చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

**విద్యార్థులకు తిప్పలే:** సమస్యలు పరిష్కరించే నాధులే కనిపించక పోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్ల వసతి లేకపోవడంతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. దాహం తీర్చుకొనేందుకు వాటర్‌ప్లాంట్ల నుంచి కొనుగోలు చేయక తప్పడం లేదు. ప్రాంగణంలోని చేతిపంపు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. పూర్తి స్థాయిలో ప్రహరీ కూడా లేకపోవడంతో పశువులు, మూగజీవాలు ప్రాంగణాన్ని అపరిశుభ్రం చేస్తుండడంతో శుభ్రం చేసుకోవడం విద్యార్థుల వంతైంది. అంతేగాక దుమ్మూ, ధూళితో నిండిపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. కనీసం నేలపై కూర్చునేందుకు అనుకూలంగా లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో నాడు-నేడు పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## డీఎస్సీ పేరుతో జగన్‌రెడ్డి వంచన : బొల్లినేని



బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న బొల్లినేని

**వింజమూరు, ఫిబ్రవరి 3:** తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రానికి కంపెనీలు తీసుకొస్తే జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రానికి గంజాయిని తీసుకొచ్చి యువత భవిష్యత్తును అంధకారం చేశాడని, డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను వంచించడానికి సిద్ధమయ్యాడని మాజీ ఎమ్మెల్యే, తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జ్‌ బొల్లినేని వెంకట రామారావు విమర్శించారు. శనివారం వింజమూరులోని అరుంధతివాడ వడ్డిపాలెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ ప్రజాదీవెన యాత్రలో అంబేడ్కర్‌ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ, జనసేన రూపొందించిన ఉమ్మడి మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. 50892 ఖాళీలు ఉంటే 6100 పోస్టులకు నోటిఫికేషన్‌ ఇచ్చి డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను మరోసారి వంచించడానికి జగన్మోహన్‌రెడ్డి సిద్ధమయ్యాడన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నెముర మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాధరెడ్డి, యారవ కృష్ణయ్య, చల్లా వెంకటేశ్వర్లు, నర్సారెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, బాషా, మాల్యాద్రి, సుధాకర్‌రెడ్డి, హజరత్‌, అంకయ్య, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి పరామర్శ

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్‌):** మండలంలోని తిమ్మాపురం గ్రామంలో కుంకు వెంకటయ్య కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో శనివారం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు టీడీపీ నాయకులతో కలిసి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో నర్రవాడ మాజీ సర్పంచ్‌ మల్లంపాటి గురవయ్యానాయుడు, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, నాయకులు కాకర్ల మధుసూదన్‌రెడ్డి, కంభం సుబ్బారెడ్డి, సుబ్బారావు తదితరులున్నారు.

## పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి

**ఆత్మకూరు, ఫిబ్రవరి 3:** భారతీయ జనతాపార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న గావ్‌ చలో (పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్‌, రూరల్‌ అధ్యక్షుడు వాసిపల్లి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న గావ్‌ చలో కార్యక్రమ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్‌ ఉప్పలూరు నరసింహులునాయుడు, సీనియర్‌ నాయకుడు గున్నం నారసింహారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొలగాని కల్యాణచక్రవర్తి, ఉపాధ్యక్షుడు కొల్లి శ్రీనివాసులనాయుడు, పట్టణ కార్యదర్శి సున్నా సంతోష్‌కుమార్‌, ఆళ్ల మధుసూదన్‌రావు, ఓబుల్‌రెడ్డి, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

**కలువాయి, ఫిబ్రవరి 3:** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక శివసాయి కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై రోడ్డు రవాణా, పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఆర్టీవో రాములు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం అన్నారు. కలువాయి ఎస్‌ఐ అయ్యప్ప మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు భయపడకుండా బాధితులను ఆసుపత్రికి తీసుకువెళ్లి కాపాడాలని కోరారు. రహదారి భద్రత, మోటారు వాహనాల చట్టం నిబంధనలు పాటించడం అందరి బాధ్యత అని, రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యమని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ నరేంద్రకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈవో

**ఉదయగిరి, ఫిబ్రవరి 3:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని ఎంఈవో-2 టీ శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలోని బీసీకాలనీ తెలుగు ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. సులభ రీతిలో విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### రూ.5 కోట్లతో గౌతమ్‌రెడ్డి స్మృతివనం : మేకపాటి

**ఉదయగిరి రూరల్‌, ఫిబ్రవరి 3:** స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల వ్యయంతో దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి స్మృతివనం ఏర్పాటు చేయనున్నట్లు ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వ్యవసాయ కళాశాలతోపాటు స్మృతివనం ఏర్పాటుచేసే ప్రాంతాన్ని కళాశాల యాజమాన్యం, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో కళాశాలను యూనివర్శిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్‌ డీన్‌ టీ గోపికృష్ణ, జడ్పీ కోఆప్షన్‌ సభ్యులు తాజుద్దీన్‌, నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## కనిపించని సచివాలయ ఉద్యోగులు

● స్పందన తీరుపై విమర్శలు

**వరికుంటపాడు, ఫిబ్రవరి 3:** సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ప్రగల్భాలు పలికే ప్రభుత్వ మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. అధికారులు సైతం పదే పదే హెచ్చరిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వారి మాటలు పట్టించుకొనే ఉద్యోగులే కరువయ్యారు. శనివారం రామాపురం సచివాలయంలో అలాంటి సంఘటనే చోటు చేసుకోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ సచివాలయ పరిధిలో వివిధ శాఖలకు చెందిన పది మంది ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా అంతంత మాత్రంగానే విధులకు హాజరవుతుండడం గమనార్హం. ప్రతి ఉద్యోగి మధ్యాహ్నం వరకు ఫీల్డ్‌ పేరుతో హాజరుకాకపోయినప్పటికీ మూడు నుంచి ఐదు గంటల వరకు తప్పనిసరిగా సచివాలయంలోనే ఉంటూ స్పందన కార్యక్రమం నిర్వహించాలనే నిబంధన ఉన్నప్పటికీ అక్కడి ఉద్యోగులునిర్లక్ష్య వైఖరితో అటువైపు కన్నెత్తి చూడనే లేదు. ఆ సమయంలో కేవలం పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్‌ అసిస్టెంట్‌, మహిళా పోలీసు మాత్రమే విధుల్లో ఉండడం చూస్తుంటే ఆ సచివాలయ పనితీరు ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతుంది. దీంతో పలు శాఖల ఉద్యోగుల కోసం అక్కడికి పరుగులు తీసిన ప్రజలకు నిరాశే మిగిలింది. సరైన సమాచారం తెలియకపోవడంతో చేసేదేమి లేక మౌనంగానే వెనుతిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సచివాలయాల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఆత్మకూరు జట్టు ఎంపిక



మంత్రి కాకాణి చేతుల మీదుగా ప్రోత్సాహక నగదు చెక్కును అందుకుంటున్న క్రీడాకారులు

**ఆత్మకూరు, ఫిబ్రవరి 3:** ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో ఆత్మకూరుకు చెందిన బ్యాడ్మింటన్‌ క్రీడా కారులు సత్తా చాటారు. శనివారం జిల్లా స్థాయిలో జరిగిన బ్యాడ్మింటన్‌ పోటీల్లో మున్సిపల్‌ పరిధిలోని నెల్లూరుపాళెం సచివాలయం పరిధిలోని క్రీడాకారులు కె అశోక్‌, సీహెచ్‌ కార్తికేయులు సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు జట్టు పై విజయం సాధించి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా వారికి రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పోత్సాహక నగదు చెక్కును అందచేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి ఆత్మకూరుకు మంచి పేరు తేవాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, పలువురు అధికారులు ఆకాంక్షించారు.

### అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**ఆత్మకూరు, ఫిబ్రవరి 3:** పట్టణంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబ సభ్యులకు ఒకొక్కరికి రూ. 10వేల వంతున సాంబశివ చారిటబుల్‌ ట్రస్ట్‌ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి శనివారం అందజేశారు. 22వ వార్డులోని వీవర్స్‌ కాలనీలో నివాసం ఉంటున్న యాకసిరి పోలమ్మ, 5వ వార్డులో షేక్‌ నజీర్‌, 10వ వార్డులోని చాకలవీధికి చెందిన కామేల్లి శ్రీరాములు, 16వ వార్డులో షేక్‌ సారంబి, 19వ వార్డులో షేక్‌ మీరాంబి కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమా ల్లో ఏఎంసీ మాజీ చైర్మన్‌ కుడుముల సుధాకర్‌రెడ్డి, మున్సిపల్‌ కౌన్సిలర్లు త్రివేణి, కొండా స్వరూపరాణి, ట్రస్ట్‌ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆనంతోనే అభివృద్ధి సాధ్యం

**అనంతసాగరం, జనవరి 3:** ఆత్మకూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం రామనారాయణరెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని అనంతసాగరం టీడీపీ సీనియర్‌ నాయకుడు పాతపాటి మదుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో ఆనం సారధ్యంలో టీడీపీ విజయం తథ్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చేలా మండలంలోని టీడీపీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని కోరారు.

### బావి స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

**వింజమూరు, ఫిబ్రవరి 3:** స్థానిక పాతూరులో ఉన్న పలుకూరు బావి ప్రాంతాన్ని పంచాయతీ స్వాధీన పరుచుకున్నట్లు సర్పంచ్‌ ఎన్‌ సుజనా తెలిపారు. ఈ స్థలం వల్ల పంచాయతీకి ఆదాయాన్ని తీసుకొచ్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేస్తామని, చిల్డ్రన్స్‌పార్కు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భవిష్యత్తులో ఈ ప్రాంతం ఎవరైనా ఆక్రమించినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### మురుగు కాలువల్లో పూడికతీత పనుల ప్రారంభం

**వింజమూరు, ఫిబ్రవరి 3 :** మండలంలోని శంకవరం గ్రామంలో మురుగు కాలువల పూడికతీత పనులను సర్పంచ్‌ బి మల్లేశ్వరి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సురేష్‌ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది చేపట్టారు. ఈ కార్యక్రమంలో బోగిరెడ్డి వెంకటరమణారెడ్డి, నాగిరెడ్డి, సానా గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లపై కంకరతో వాహనదారుల అవస్థలు

**ఉదయగిరి రూరల్‌, ఫిబ్రవరి 3:** పట్టణంలోని ప్రధాన రహదారులపై ఎక్కడపడితే అక్కడ కంకర ఉండడం తో వాహనదారులు కష్టాలు ఎదు ర్కొంటున్నారు. కంకర రవాణా చేసే టిప్పర్లు, ట్రాక్టర్లు పరిమితికి మించి తరలిస్తూ తమ ఇష్టానుసారంగా వాహనాలను నడుపుతుండడంతో అం దులో ఉన్న కంకర రహదారులపై పడి ప్రమాదాలకు దారితీస్తోంది. రోడ్లపై కంకరను అలాగే వదిలేస్తుండడంతో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంకర రవాణా చేసే వాహనదారులను హెచ్చరించి రహదా రులపై కంకర పడకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### వీఆర్వోకు సన్మానం



వీఆర్వోకు సన్మానం చేస్తున్న కార్యాలయ సిబ్బంది

**సంగం, ఫిబ్రవరి 3:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సంగం వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ సీనియర్‌ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వెళ్తున్న రవిబాబును శనివారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్‌ కుమార్‌, రీసర్వే డీటీ అశోక్‌ కుమార్‌, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# కావలి

## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి



## టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు

**కందుకూరు, ఫిబ్రవరి 3:** తెలుగుదేశం పార్టీ గెలుపు ద్వారా చంద్రబాబును సీఎం చేయటమే లక్ష్యంగా వచ్చే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయాలని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు కోరారు. శనివారం సాయంత్రం కందుకూరులోని పార్టీ కార్యాలయంలో క్లస్టర్‌ ఇన్‌చార్జిలు, యూనిట్‌ ఇన్‌చార్జిలతో వారు సమావేశం నిర్వహించారు. తొలుత ఒక్కొక్కరిని పిలిచి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఆనంద్‌బాబు, అశోక్‌బాబులు నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌తో ప్రత్యేకంగా మాట్లాడి వెళ్లారు. ఈ సమావేశంలో నాయకులు ఇంటూరి నాగేశ్వరరావు, దివిశివరాం, కుసుమకుమారి, దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, రాచగర్ల సుబ్బారావు, నార్నె రోశయ్య పాల్గొన్నారు.

● **కుట్టుమిషన్ల పంపిణీ :** టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో రెండో బ్యాచ్‌ శిక్షణ పూర్తిచేసుకున్న 60మంది మహిళలకు సర్టిఫికెట్లతో పాటు ఉచితంగా కుట్టుమిషన్లను నక్కా ఆనంద్‌బాబు, అశోక్‌బాబు అందించారు.

### హెల్మెట్‌ ధారణతో ప్రమాదాల నివారణ



ర్యాలీని ప్రారంభిస్తున్న సుధాకరరెడ్డి. రఫీ తదితరులు

**కందుకూరు, ఫిబ్రవరి 3:** రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించడంతోపాటు ఐఎస్‌ఐ మార్కు కలిగిన హెల్మెట్‌లను ధరించడం ద్వారా ప్రమాదాలను, ప్రాణనష్టాన్ని నివారించవచ్చని కావలి ప్రాంతీయ రవాణాశాఖాధికారి వై.సుధాకరరెడ్డి పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం కందుకూరులో మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మితిమీరిన వేగం, మద్యం సేవించి వాహనాలు నడపటమే ప్రమాదాలకు కారణ మని పేర్కొన్నారు. కార్యక్రమంలో కందుకూరు ఎంవీఐ ఎస్కే మహమ్మద్‌ రఫీ, రూరల్‌ ఎస్‌ఐ పీ నరేష్‌, ఏఎస్‌ఐ కె. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

### అద్వానీకి భారతరత్న పట్ల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

**కావలి టౌన్‌, ఫిబ్రవరి 3 :** బీజేపీ సీనియర్‌ నేత ఎల్‌ కె అద్వానీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం పట్ల శనివారం శివాజీ విగ్రహం వద్ద బీజేపీ నేతలు సంబరాలు నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కందుకూరి సత్యనారాయణ, వీవీ రంగారెడ్డి, సీవీసీ సత్యం, వెంకటేశ్వర్లు, వాయుగుండ్ల సుధీర్‌ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భగా మిఠాయిలు పంచిపెట్టారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**లింగసముద్రం, ఫిబ్రవరి 3:** మండలంలోని మన్నేరువాగులో ఇసుకను అక్రమంగా నింపుకుంటున్న నాలుగు ట్రాక్టర్లను కందుకూరు ఎస్‌ఈబీ అధికారులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు శనివారం తెల్లవారుజామున కందుకూరు సెబ్‌ అధికారులు, సిబ్బందితో దాడి చేసి ఇసుక రవాణాకు సిద్ధంగా ఉన్న నాలుగు ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు.అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనపై సెబ్‌ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌చార్జి ఎస్‌ఐ మహేంద్రనాయక్‌ చెప్పారు.

### లింగసముద్రం ఎస్‌ఐగా మహేంద్రనాయక్‌

**లింగసముద్రం, ఫిబ్రవరి 3:** లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌ ఇన్‌చార్జి ఎస్‌ఐగా వలేటివారిపాలెం ఎస్‌ఐ మహేంద్రనాయక్‌ను నియమించారు. లింగసముద్రం ఎస్‌ఐ ఎం బాజీబాబు అసెంబ్లీ బందోబస్తుకు వెళ్లారు. ఆయన వచ్చేవరకు మహేంద్రనాయక్‌ ఇన్‌చార్జి ఎస్‌ఐగా కొనసాగుతారని గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు శనివారం తెలిపారు.

### మాలకొండ ఆదాయం రూ. 6,59,561

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 3:** మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,59,561 ఆదాయం లభించినట్లు ఆలయ ఏసీ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 5,300, కుంకుమార్చన ద్వారా రూ. 22,840, తలనీలాల ద్వారా రూ. 23,450, వాహనపూజల ద్వారా రూ. 2,880, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,41,800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 1,020, రూముఅద్దెల ద్వారా రూ. 29,330, కవర్ల ద్వారా రూ. 4,800, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,76,965, అన్నదానం ద్వారా రూ. 2,31,176, విరాళాల ద్వారా రూ. 20 వేలు ఆదాయం లభించిందన్నారు.

### నేడు విద్యుత్‌కు అంతరాయం

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 3 :** మండలంలోని రోళ్లపాడు, లింగపాలెం, అమ్మపాలెం, బంగారక్కపాలెం, బండివారిపాలెం గ్రామాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మధుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్‌ హైవే పనుల్లో భాగంగా విద్యుత్‌ స్తంభాలు మార్చే క్రమంలో విద్యుత్‌ సరపరా నిలిపి వేస్తునట్లు ఆయన తెలిపారు. వ్యవసాయానికి 9 గంటలు విద్యుత్‌ ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు.

### తిప్ప జూనియర్‌ కాలేజీలో క్లీన్‌ అండ్‌ గ్రీన్‌



చెత్త ఏరుతున్న విద్యార్థులు

**బిట్రగుంట, ఫిబ్రవరి 3:** బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు శనివారం నాగులవరంలో క్లీన్‌ అండ్‌ గ్రీన్‌ నిర్వహించారు. సచివాలయం, గ్రామ పరిసర ప్రాంతాల్లోని చెత్త తొలగించి కాల్చివేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ పీవో వెంకటసుబ్బయ్య, డిజిటల్‌ అసిస్టెంట్‌ మణిరత్నం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా ప్రసన్నుడి ఊంజల్‌సేవ



ప్రసన్నుడికి నిర్వహించిన ఊంజల్‌సేవ

**బిట్రగుంట, ఫిబ్రవరి 3:** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరుడి శనివారం ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. జలదంకి మండలం వేముల పాడు గ్రామస్థులు అన్నసంతర్పణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. రాత్రికి శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరుడికి ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి సభ్యులు తులసీరామ్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పొలాల్లో జోరుగా మోటార్ల చోరీలు

**లింగసముద్రం, ఫిబ్రవరి 3:** మండల పరిధిలోని గ్రామ పొలాల్లో ఉన్న మోటార్లను, కేబుళ్లను దొంగలు తీసుకెళుతున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని పెదపవని, ముత్యాలపాడు, ముత్తంవారిపాలెం గ్రామాల్లో ఇటీవల ఈ తరహా చోరీలు ఎక్కువయ్యాయి. ముత్యాలపాడులో రెండు మోటార్లను, 15 కేబుళ్లను, ముత్తంవారిపాలెంలో 15 కేబుళ్లను, పెదపవనిలో రెండు మోటార్లను, 15 కేబుళ్లను దొంగలు చోరీ చేశారని రైతులు చెప్పారు.ఒక్కో మోటారు విలువ రూ.25 వేలు, ఒక్కో కేబుల్‌ విలువ సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఉంటుందని చెప్పారు. ఇటీవల ముత్యాల పాడులో ముగ్గురు దొంగలను పోలీసులకు పట్టిచ్చినట్టుగా రైతులు చెప్పారు. కాగా తాము దొంగలను విచారిస్తున్నట్టు ఎస్సై ఎం బాజీబాబు చెప్పారు.

### విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ శ్యాంప్రసాద్‌

**కావలిటౌన్‌, ఫిబ్రవరి3:** విద్య ద్వారానే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌ శ్యాంప్రసాద్‌ పేర్కొన్నారు. శనివారం ముసునూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రాధాన్యత, బాల్య వివాహాల్లో తల్లితండ్రుల పాత్ర అనే అంశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో రిటైర్డ్‌ ఉద్యోగులు మొగల్‌ సిరాజ్‌బేగ్‌, ఖాదర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

### కుట్టుమిషన్‌ పంపిణీ




కుట్టుమిషన్‌ అందిస్తున్న ప్రసాదరావు, సురేంద్ర

**కావలిటౌన్‌, ఫిబ్రవరి3:** అమరా బాలసుబ్రహ్మణ్యం మనవడు నాగనిమేష్‌ పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం పేదమహిళకు కుట్టుమిషన్‌ అందించారు. సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మీకాంత అనే పేదమహిళకు రత్నమ్మ ఫౌండేషన్‌ అధ్యక్షుడు ప్రసాదరావు చేతుల మీదుగా కుట్టుమిషన్‌ అందించారు. అనంతరం బుడమగుంట గిరిజన కాలనీలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

# ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు

● అనుమతులు లేకుండా ఏర్పాటు ● ప్రభుత్వ ఖజానాకు గండి ● పట్టించుకోని అధికారులు



వలేటివారిపాలెంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు

**వలేటివారిపాలెం, ఫిబ్రవరి 3 :** మండలంలోని అయ్యవారిపల్లె, వలేటివారిపాలెం, చుండి, కాకర్లవారిపాలెం, పోలినేనిచెరువు, గరుకుపాలెం, పెద్దఅమ్మపాలెం గ్రామాల్లో ఇష్టానుసారం ఇటుక బట్టీలు ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీకి చెల్లించాల్సిన రాయిల్టీకి ఎగనామం పెడుతూ బట్టీలు కొనసాగిస్తున్నారు. చెరువులు, కుంటల నుంచి అనుమతి లేకుండా మట్టి తరలించి ఇటుకలు తయారు చేస్తూ లక్షలు గడిస్తున్నారు. అయినా అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

● **రాయల్టీ చెల్లించడం లేదు..**

ఇటుక బట్టీలు ఏర్పాటు చేయాలంటే ఇటుకలు తయారు చేసిన లెక్కల ప్రకారం పంచాయతీకి రాయల్టీ చెల్లించాలి. లక్ష ఇటుకలు పైన తయారు చేసే బట్టీల నిర్వాహకులు ట్రేడ్‌, లైసెన్స్‌ వ్యాపార పన్ను కట్టాల్సి ఉంటుంది. అంతేకాక తయారు చేసిన ఇటుకలు కాల్చేందుకు పొల్యూషన్‌ అధికారుల నుంచి అనుమతులు పొందాలి. గ్రామ పంచాయతీతో పాటు రెవెన్యూ, ఇరిగేషన్‌, భూగర్భ, అటవీశాఖ, కార్మికశాఖ అనుమతులు కూడా పొందాల్సి ఉంటుంది. అయితే ఇటుక బట్టీల నిర్వాహకులు అవేమి పట్టించుకోకుండా బట్టీలు నిర్వహిస్తున్నారు. పలు గ్రామాలలో వ్యవసాయ భూములతోపాటు ప్రభుత్వ భూములలో ఇటుక బట్టీలు నిర్వమిస్తున్నారు. వ్యవసాయ భూముల్లో వ్యవసాయేతర పనులకు వినియోగిస్తున్నందున రెవెన్యూకు 9 శాతం సుంకం చెల్లించాలి. అంతేకాకుండా వాల్టా చట్టాన్ని అతిక్రమిస్తూ ప్రభుత్వ చెరువుల్లోని మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మట్టిని అక్రమంగా తరలించి ఇటుకలు తయారీకి వినియోగించడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.

● **బాల కార్మికులతో పనులు**

ఇటుక బట్టీల నిర్వాహకులు ఒడిశా నుంచి కార్మికులను తీసుకువస్తున్నారు. ఇందులో బాల కార్మికులే ఎక్కువగా ఉంటున్నారు. ప్రతి ఇటుక బట్టీ వ్యాపారి వద్ద సుమారు ఐదారుమంది బాలకార్మికులు పని చేస్తుంటారు. అయినా అధికారులు స్పందించడం లేదు. జిల్లా అధికారులు స్పందించి ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## కంపుకొడుతున్న పల్లెలు!

**లింగసముద్రం, ఫిబ్రవరి 3 :** మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు నీరు, కుళాయిల్లో వృథాగా పోయే నీరు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌ రోడ్లు, అంతర్గత మట్టి రోడ్లపై నిల్వ చేరడంతో పల్లెలు కంపుకొడుతున్నాయి. దీంతో ప్రజలు, దీహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పెదపవని, అన్నెబోయినపల్లి, లింగసముద్రం, మొగిలిచెర్ల గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. అక్కడ దోమల ఉత్పత్తి చెంది రాత్రి వేళల్లో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోన్నాయి. అయినా పంచాయతీ పాలకులు, కార్యదర్శులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రెండురోజుల్లో రైతులకు సాగునీరు ఇవ్వాలి

● ఇరిగేషన్ కార్యాలయం ఎదుట టీడీపీ ఆందోళన



ఇరిగేషన్ కార్యాలయం వద్ద బైఠాయించిన టీడీపీ నాయకులు

పొదలకూరు, ఫిబ్రవరి 3 : కండలేరు ఎడమ గట్టు కాలువ, సోమశిల దక్షిణ కాలువ ద్వారా ఆయా రైతులకు సాగునీరు అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, రైతు సంఘం నాయకుడు కోడూరు భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయాన్ని టీడీపీ నాయకులు ముట్టడించి ఆందోళన చేపట్టారు. అనంతరం ఏఈ వేణుగోపాల్, మైనర్ ఇరిగేషన్ డీఈ విజయభాస్కర్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కాకాణి తన సొంత మండలానికి మొదటి పంటకు నీళ్ల ఇవ్వకుండా 12వేల ఎకరాలను బీడు పెట్టించారని, కురిసిన వర్షపు నీటితోనే రైతులు పంటలేసుకున్నారని, అప్పోసప్పో చేసి పూర్తిస్థాయిలో పెట్టుబడులు పెట్టి తీరా నీరు లేకపోవడంతో సతమతమవుతున్నారని తెలిపారు. రెండు రోజుల్లో సోమశిల దక్షిణ కాలువకు, అదేవిధంగా కండలేరు ఎడమగట్టు కాలువకు నీరు విడుదల చేయకుంటే నీటిపారుదల శాఖ కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే మండలంలోని చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బక్కయ్యనాయుడు, అక్కెం సుధాకర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, జమీర్, వి రామకృష్ణ, పల్లారపు కృష్ణ, కండే సురేష్, చిన్నా, వెంకటేశ్వర్లు, మల్లినేని వెంకటేష్, ఆశీర్వాదం, తదితరులున్నారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

## కనుల పండువగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రాపూరు (డక్కిలి), ఫిబ్రవరి 3 : పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి కల్యాణం శనివారం కనుల పండువగా జరిగింది. ఉదయం 4 గంటలకు స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం 10-30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం వేడుకగా సాగింది. అనంతరం స్వామివారికి కల్యాణ చదివింపులు అందచేసేందుకు, అక్షింతల కోసం భక్తులు పోటీపడ్డారు. వేదపండితుల మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలు నడుమ ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సహయ కమిషనరు కె జనార్దన్ రెడ్డి ఏర్పాట్లు చేశారు.

## కేన్సర్‌పై అవగాహన సదస్సు

వెంకటాచలం, ఫిబ్రవరి 3: మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా కంటి, దంత పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ లక్ష్మీ క్యాన్సర్ పట్ల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం వారికి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దమ్ము కొండలరావు, లయన్స్ క్లబ్ గవర్నర్ నాగేశ్వరరావు యాదవ్, అధ్యక్షుడు కృష్ణకుమార్, సభ్యుడు అంజనేయులు తదితరులున్నారు.

## చలో అసెంబ్లీని జయప్రదం చేయండి

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 3: పంచాయతీ సమస్యలపై చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా పంచాయతీల ఇన్‌చార్జ్, పంచాయతీరాజ్ చాంబర్ గోపిరెడ్డి వెంకటేశ్వర్లు కోరారు. శనివారం మండలంలోని విలుకానిపల్లి గ్రామంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సర్పంచ్‌లందరూ రాజకీయాలకతీతంగా ఫిబ్రవరి 6వ తేదీ ఉదయం 9గంటలకు విజయవాడ, అమరావతిలోని అసెంబ్లీ దగ్గరికి చేరుకుని చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొని అసెంబ్లీని ముట్టడించి హక్కుల సాధనలో భాగస్వాములు కావాలని కోరారు.

## పరిసరాల పరిశుభ్రత

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 3: మండలంలోని పల్లెపాడులో నెల్లూరు కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం సచివాలయం, శివాలయ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామస్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు గూడూరు జయరామయ్య, సర్పంచి రెడ్డిపోగు సుధాకర్, వార్డు మెంబరు రామయ్య, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీహరి పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్పీ



ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డికి మొక్కను బహూకరిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థిని

కోవూరు, ఫిబ్రవరి 3 : విద్యార్థులంతా మోటార్‌బైక్‌లు నడిపే సమయంలో విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాల్సిందిగా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కోరారు. గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ భద్రతా మాసోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి బైక్‌లు నడిపితే ప్రమాదాలు తప్పించుకోవచ్చని అన్నారు.అనంతరం ప్రమాదాలకు తావివ్వకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్, ఏఎస్పీలు సౌజన్య,ఏపీవీఆర్‌బీ ప్రసాద్, డీఎస్పీ వీరాంజనేయ రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

## కావేరి సీడ్స్‌పై చర్యలు తీసుకోండి

● పోలీసులకు ఏవో ఫిర్యాదు

మనుబోలు, ఫిబ్రవరి 3: నెల్లూరులో ఉన్న కావేరి సీడ్స్ దుకాణంపై చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జహీర్ వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సత్యవతి ఆదేశాలతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కావేరి సీడ్స్ చెర్లోపల్లి రైతులకు నకిలీ విత్తనాలు ఇచ్చి మోసం చేసింది. ఈవిషయంపై పత్రికల్లో కథనాలు రాగా అధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించి నకిలీ విత్తనాలేనని తేల్చారు. దీంతో రైతులు నష్టపోయారు. దీని ఆధారంగా కావేరి సీడ్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## బుచ్చి కమిషనర్‌గా వెంకట రమణ బాబు

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి3: బుచ్చి నగర పంచాయతీ కమిషనర్‌గా ఏలూరి వెంకట రమణ బాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అలాగే ఎంపీడీవోగా రాజ్యలక్ష్మి బాధ్యతలు చేపట్టారు. తహసీల్దారుగా పీ సురేష్‌బాబును నియమించినట్లు తెలిసింది.

## ప్రజల ప్రాణాలంటే అంత చులకనా ? : సోమిరెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

ముత్తుకూరు, ఫిబ్రవరి 3 : జిల్లా ప్రజల ప్రాణాలంటే మంత్రులకు చులకనగా మారిందని టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మల్లూరు పంచాయతీలో నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యతు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రాన్ దెబ్బతిని సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో వందల టీఎంసీ నీటిపారుదల ప్రమాదకర పరిస్థితుల్లో ఉంటే, నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ మంత్రులు అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలకు పట్టడంలేదన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు బొమ్మి సురేంద్ర, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం మల్లి కార్జునయాదవ్, అధ్యక్షుడు ఈపూరు మునిరెడ్డి, గుమ్మడి రాజాయాదవ్ పాల్గొన్నారు.

## ఇళ్లు కట్టిస్తామంటూ ఉన్నవాటిని కూల్చేశారు !



గిరిజనులతో మాట్లాడుతున్న కేసీ పెంచలయ్య

విడవలూరు, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని వావిళ్ల గిరిజన కాలనీలో ఇళ్లు కట్టిస్తామని చెప్పి ఉన్నవాటిని కూల్చేశారని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. పీఎంఏవై పథకం కింద ఇళ్లు కట్టిస్తామని గిరిజనులకు చెందిన 8 ఇళ్లను అధికారులు పడగొట్టారని ఆయన తెలిపారు. నిరాశ్రయులైన గిరిజన కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. ఇళ్లు కట్టిస్తామని చెప్పి 6 నెలలు గడుస్తున్నా, ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకుని పోతామని తెలిపారు. సోమవారం తహసీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల ధర్నాకి దిగుతామన్నారు. కార్యక్రమంలో చెంబేటి ఉషా తదితరులు పాల్గొన్నారు.

## రేపు ఉచిత హోమియో వైద్య శిబిరం

నెల్లూరు(సాంస్కృతికం) : నెల్లూరులోని యశోదర హోమియో క్లినిక్‌లో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ యశోదర తెలిపారు. పురమందిరంలో శనివారం ఆమె కరపత్రాలు ఆవిష్కరించారు. తమ క్లినిక్ ప్రారంభించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.మురళీమోహన్‌రాజు, వెంకురెడ్డి, శరత్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో టీడీపీ నేతలు

కోవూరు, ఫిబ్రవరి 3: టీడీపీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి శనివారం పడుగుపాడు మజరా స్టౌబీడీ కాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్య త్తు గ్యారంటీ కార్యక్ర మంలో భాగంగా ఇంటిం టికీ తిరిగి ప్రచారం చేప ట్టారు. ఈ సందర్భంగా ఆయన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇంతా మల్లారెడ్డి,చెంబేటి పెంచలయ్య, బాలరవి, తిరుమూరు అశోక్‌రెడ్డి,నాటకరాని వెంకట్, సాదిక్, గుంజి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా ప్రమాణాలు తప్పక పాటించాలి

● పోర్టు సీవోవో రాజన్‌బాబు



ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ వెంకటరెడ్డి

ముత్తుకూరు, ఫిబ్రవరి 3: రోడ్డు భద్రతా ప్రమాణా లను ప్రతిఒక్కరూ తప్పక పాటించాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు సూచించారు. శని వారం పోర్టులో నిర్వహించిన జాతీయ రహదారుల భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా భద్రతా చర్యలు తీసుకుని సురక్షితంగా ప్రయాణం సాగించాలని కోరారు. అదానీ కృష్ణపట్నం పోర్టులో భద్రతతోపాటు పర్యా వరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రమాదరహిత పోర్టుగా నిలిచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రహదారుల భద్రతపై నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందించారు. అదానీ కృష్ణపట్నం సర్కిల్ సీఐ వెంకటరెడ్డి, ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, అదానీ విద్యామందిర్ విద్యార్థులతో ముత్తు కూరులో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం చేపట్టి ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సెక్యూరిటీ హెడ్ వెంకటేష్, భాస్కరన్, సెక్యూరిటీ డీజీఎం మనోహర్‌బాబు, సేఫ్టీ హెడ్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ హత్యకు నిరసన



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

మనుబోలు, ఫిబ్రవరి 3: విశాఖ పట్టణంలో తహసీల్దార్ రమణ య్యపై దాడిచేసి హత్య చేయడం దారుణమని మనుబోలు తహసీల్దార్ శివకృష్ణ య్య ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియే షన్ పిలుపు మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తించారు. తహసీల్దార్ కార్యాలయం బయట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివకృష్ణయ్య మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్‌లు శ్రీకాంత్‌రెడ్డి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీలో కారుణ్య నియామకాలు

నెల్లూరు(జడ్పీ), ఫిబ్రవరి 3: జిల్లా పరిషత్‌లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టారు. ఈ మేరకు శనివారం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో చిరంజీవులు ఇద్దరికి సబార్డినేటర్లుగా ఉద్యోగ అవకాశం కల్పిస్తూ నియామక పత్రాలు అందజేశారు.

# ఓటరు నమోదుకు చివరి అవకాశం : కమిషనర్



బైక్ ర్యాలీలో కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 3 : నెల్లూరు సిటీలోని అర్హులకు ఓటరుగా నమోదు చేసుకోవడానికి చివరి అవకాశం ఉందని ఎస్ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్ పిలుపునిచ్చారు. శనివారం కార్పొ రేషన్ కార్యాలయంలో శకటాలతో పాటు బైకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని పౌరులు ఓటరుగా నమోదుకు దరఖాస్తులు అందచేయాలని సూచిం చారు. సచివాలయాల్లోని తమ సిబ్బంది వద్ద అన్ని వివరాలతో కూడిన దర ఖాస్తులను ఇవ్వవచ్చని, లేదా బీఎల్వోల వద్ద అందచేయాలని చెప్పారు. ఆపై సమగ్ర విచారణ అనంతరం ఓటరుగా జాబితాలో పేరు నమోదు చేస్తారన్నారు. ఇతర అభ్యంతరాలున్న దరఖాస్తుల ద్వారా తెలియచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీ దేవికుమారి, మేనేజర్ ఇనయతుల్లా, ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు. కాగా నగర మేయర్ పోట్లూరి స్రవంతి 12వ డివిజన్ పరిధిలోని పెద్దచెరుకూరు గ్రామ ఎస్టీ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలను అందించారు.

## టీడీపీ ప్రచార గీతం ఆవిష్కరించిన నారాయణ



ప్రచార గీతాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణ

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 3 : మాజీ మంత్రి, టీడీపీ సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ శనివారం ఎన్నికల ప్రచార గీతంను బాలయ్య సైన్యం ఆధ్వర్యంలో టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవి ఆధ్వర్యంలో సింగశెట్టి మురళీమోహన్‌రావు చైతన్య వంతమైన స్ఫూర్తి ఆడియో, వీడియోను రూపొందించారు. ఈ సందర్భంగా పొంగూరు నారాయణ మాట్లాడుతూ ఈ ప్రచార గీతం ప్రజలను ఎంతో చైతన్య వంతం చేస్తుందన్నారు. ఈ పాటలో తెలుగుదేశం పార్టీ విధివిధానాలను నెల్లూరులో తాను గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ రూపొందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు ఈ పాటను తమ గ్రూపుల్లో, వాట్సప్‌లలో విరివిరిగా ప్రచారం చేసి రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ పాటను రూపొందించేందుకు సింగంశెట్టికి ఆర్థిక సాయం చేసిన టీడీపీ నేత శ్రీహరినాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలయ్య సైన్యం జిల్లా అధ్యక్షుడు ఎద్దల రవి, నేతలు ప్రసాద్‌నాయుడు, పోతయ్య, కుంచాల శ్రీనివాసులు, నారా శ్రీనివాసులు, పూజారి శ్రీనివాసులరెడ్డి, ఆవుల సురేష్, షరీఫ్, మీరా మొహిద్దీన్, మాతంగి కృష్ణ, నెల్లూరు మురళి, మేడా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే నారాయణ క్యాంపు కార్యాలయంలో టీడీపీ నేతలు, కార్యకర్తలతో భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. అదేవిధంగా నగరంలోని 39వ డివిజన్‌లో బాబూ ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి తిరిగి టీడీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, ముప్పాళ్ల విజేత, దొడ్డపనేని రాజానాయుడు, కరీముల్లా, అన్నంగా ప్రసాద్, సుజనా, దీన్‌దయాళ్, తదితరులు పాల్గొన్నారు.

## మిల్క్ యాక్టు సక్రమంగా అమలవ్వాలి

● పశుసంవర్ధకశాఖ జేడీ మహేశ్వరుడు



డైరీ ఆవిష్కరిస్తున్న జేడీ మహేశ్వరుడు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 3 : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న మిల్క్ యాక్టును సక్రమంగా అమలు చేయాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు సూచించారు. నెల్లూరు రైల్వేఫీడర్సు రోడ్డులోని పశుసంవర్ధకశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మిల్క్ యాక్టుపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అధికారులు తమ లక్ష్యాల్లో ప్రగతిని సాధించాలన్నారు. కృత్రిమ గర్భధారణ, పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో పుట్టిన పెయ్యదూడలను భారత్ పశుధన్‌యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జీవాలు, పశువులకు వ్యాక్సిన్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యుల డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీడీలు కోటేశ్వరరావు, నాగమణి, సోమయ్య, ఏడీ చైతన్యకిషోర్, పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు జయచంద్ర, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ వినియోగంపై బైక్ ర్యాలీ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 3: జాతీయ భద్రత మా సోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని శ్రీహరి నగర్ సెంటర్ నుంచి భక్తవత్సల నగర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉపరవాణ కమిషనర్ బీ చందర్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించి హెల్మెంట్ ధరించి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు కొర్రపాటి మురళీమోహన్, బాలమురళీకృష్ణ, రాంబాబు, కార్తీక్ పవన్‌కుమార్, సహాయ మోటర్ వాహన తనిఖీ అధికారులు వీర పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారాయణలో క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం

నెల్లూరు(వైద్యం), ఫిబ్రవరి 3 : నారాయణ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతం చేసినట్లు నారాయణ ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రాచూరి శ్రీలక్ష్మి వెల్లడించారు. శనివారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నెల్లూరు నగరానికి చెందిన భవననిర్మాణ కార్మికుడు మహేష్‌రెడ్డి ఎడమ చేతికి, ఎడమ కాలికి నరాలు తెగి ఆసుపత్రికి వచ్చారన్నారు. వెంటనే శస్త్రచికిత్స ద్వారా నరాలను సరిచేయడంతో రక్తం సరఫరా జరిగి కోలుకుంటున్నారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నై, హైదరాబాద్ వంటి మెట్రో నగరాలలోనే అందుబాటులో ఉండే శస్త్రచికిత్సలు ప్రస్తుతం నారాయణ ఆసుపత్రిలో అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మత్తు వైద్య నిపుణులు డాక్టర్ ప్రభావతి, డాక్టర్ రవీంద్రరెడ్డి, ఏజీఎం శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అలరించిన చిన్నారుల నృత్యం

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 3 : మండలంలోని సౌత్‌మోపూరులో శనివారం శ్రీపాద స్కూల్ 11వ వార్షికోత్సవమంనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటలు, పాటలతో అలరించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ రామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గడిచిన 11 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులతో కార్పొరేట్ తరహా విద్య అందిస్తున్నామని చెప్పారు. సౌకర్యాలలో ఎక్కడ రాజీపడకుండా సమకూర్చుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సుచరిత పాల్గొన్నారు.

## వైసీపీకి చరమగీతం పాడుదాం



ప్రజలతో మాట్లాడుతున్న మనుక్రాంత్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 3: నియంతృత్వ పాలన సాగిస్తున్న వైసీపీకి రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడుదామని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని జాకీర్‌హుస్సేన్ నగర్ ప్రభుత్వ హైస్కూల్ వాటర్ ట్యాంక్ దగ్గర నుంచి శనివారం జనం కోసం జనసేన, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలను నిర్వహించారు. వైసీపీ నియంతృత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, డివిజన్ ఇన్‌చార్జి అనుదీప్‌రెడ్డి, టీడీపీ నేతలు ఆదినారాయణరెడ్డి, మాల్యాద్రి పాల్గొన్నారు.

## ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 3 : పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా శనివారం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ను యూటీఎఫ్ నేతలు ఆవిష్కరించారు. నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రావడం కోసం వచ్చిన వారం రోజుల లోపల సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామని జగన్మోహన్‌రెడ్డి వాగ్దానం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు సీపీఎస్ రద్దు చేయకపోగా ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తూ జీపీఎస్ అనే కొత్త పద్ధతిని తీసుకువచ్చారన్నారు. రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్‌ల ద్వారా జిల్లాలో విస్తృతం ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీవీ.శేషులు, ప్రధాన కార్యదర్శి జీవీ.చలపతిశర్మ, కోశాధికారి ఏ.మురళీధర్‌రావు, కార్యదర్శులు కే.నాగిరెడ్డి, ఇ.బాలరాగయ్య, ఎస్‌కె.ఖాజావలి, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.శీనయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

## కలెక్టరేట్ ఏవోగా మధుసూదన శర్మ

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 3 : కలెక్టరేట్ పరిపాలనాధికారిగా డీవీ మధుసూదన్‌శర్మను నియమిస్తూ కలెక్టర్ హరినారాయణన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదన్‌శర్మ గతంలో కలెక్టరేట్ ఏవోగా పనిచేశారు. ఆ తరువాత నెల్లూరు అర్బన్ తహసీల్దారుగా, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా పని చేశారు. ప్రస్తుతం నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో డీఏవోగా విధులు నిర్వహిస్తుండగా తిరిగి కలెక్టరేట్ ఏవోగా నియమించారు. ఆయన నియామకంపై పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

## జేసీకి వీఆర్‌వోల శుభాకాంక్షలు

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 3 : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ను వీఆర్వో సంఘం నాయకులు శనివారం మార్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పంట అశోక్‌కుమార్‌రెడ్డి, నాయకులు గున్నయ్య, తిరుమలరాజు నాగేంద్రకుమార్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఎల్‌సీ ఎస్ఈకి సన్మానం

నెల్లూరు(హరనాథపురం), ఫిబ్రవరి 3 : ఎస్ఎస్ఎల్‌సీ, ఎస్‌బీ సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీరుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డి.రాధాకృష్ణమూర్తిని ఇరిగేషన్ ఎన్జీవో సంఘ నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాయుడు వెంకటస్వామి, కార్యదర్శి డేగల మార్కొండేయులు, కే.ఓబులేసు, జి. రామకృష్ణ, ఎస్ ప్రభాకర్ సింగ్, ఎస్‌డీ అజీజ, పి.సతీష్, ముంగర రంగధరబాబు, వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

## టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత



పాత వెల్లంటిలో మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 3 : నెల్లూరులో ఇటీవల నిర్వహించిన రా.... కదలిరా..! సభకు వచ్చి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలుకోల్పోయిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆ పార్టీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శనివారం రూ.10 లక్షల చెక్కును అందచేశారు. పాతవెల్లంటిలో మృతుడు జువ్వల శీనయ్య ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం చెక్కును ఆయన సతీమణికి అందచేశారు. అనంతరం ఇదే ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇద్దరికి రూ. 50 వేలు, 6 మందికి రూ. 10 వేలు చొప్పున వారి ఇళ్లకు వెళ్లి అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బియ్యం ధర తగ్గిస్తే రైతులకే నష్టం

నెల్లూరు(సాంస్కృతికం), ఫిబ్రవరి 3 : బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు పెరిగాయని కేంద్ర ప్రభుత్వం రూ.29 విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షణీయమని రైతు పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు కోడూరు రవీంద్రరెడ్డి తెలిపారు. శనివారం సమితి సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు రూ.29కి కేజీ బియ్యం ఇస్తే దేశంలోని లక్షలాది మంది రైతులకు తమ పంటకు మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుకు సీజనల్ పంట ఖర్చులు పోను ఆదాయం వచ్చేలా కనీస మద్దతు ధరను ప్రతి సీజన్‌లో రైతుకు లభించేలా ముందు ప్రభుత్వాలు చర్యలు తీసుకుని బియ్యంను పంపిణీ చేయాలని కోరారు.


## ఆ.. సచివాలయ సెక్రటరీ ఎవరు ?

● వాస్తవాలు విచారించి నివేదిక ఇవ్వండి

● సిటీ ప్లానింగ్ అధికారులను ఆదేశించిన కమిషనర్, సీపీ

నెల్లూరు(సిటీ), ఫిబ్రవరి 3 : నగరంలోని 12వ డివిజన్‌లోని ఓ సచివాలయ సిటీప్లానింగ్ సెక్రటరీ ఆర్థిక దందాపై కార్పొరేషన్ ఉన్నతాధికారులు దృష్టి సారించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఇక్కడ అంతా నేనే' శీర్షికపై ఆరా తీసిన కమిషనర్ వికాస్‌మర్మత్, సిటీ ప్లానింగ్ ఉన్నతాధికారి దేవికుమారిలు ఆ.. ప్లానింగ్ సెక్రటరీ ఎవరు...? అన్నది క్షేత్ర స్థాయిలో విచారించి తమకు నివేదిక అందచేయాలని కింది స్థాయి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ఆ సచివాలయ పరిధిలో జరిగిన ఇళ్ల నిర్మాణం, అందులోని లోపాలును కూడా గుర్తించాలని పేర్కొన్నట్లు తెలిసింది. కాగా ఈ కథనం రూరల్, సిటీ నియోజవకవర్గాలోని రాజకీయ నాయకుల్లో చర్చనీయాంశంగా మారింది.

# సెంటిమెంట్ 'సింధూరం'




సెంటిమెంట్‌కు పునాది అభద్రత అంటారు. రాజకీయ నాయకులకు సహజంగానే సెంటిమెంట్లు ఎక్కువ. తిరుపతి నగరంలోని ఒక హోటల్ చాలా ఏళ్లుగా స్థానిక నాయకులకు సెంటిమెంట్‌గా మారింది. గోవిందరాజస్వామి కోనేటి కట్ట సమీపంలో ఉండే ఈ హోటల్ ముందు నాయకుల కార్లు బారులు తీరి కనిపిస్తాయి. ఎన్నికల సమయంలో అర్ధరాత్రీ అపరాత్రీ అని లేకుండా ఇక్కడికి రాకపోకలు సాగుతుంటాయి. బుజ్జగింపులు, సర్దుబాట్లు, బెదిరింపులు.. వ్యూహాలూ, ప్రతివ్యూహాలకు ఈ హోటలే వేదిక. నిజానికి దీనికి ఎదురుగా ఉన్న కోనేటి కట్ట ఒకప్పుడు రాజకీయ అడ్డాగా ఉండేది. ఏ పార్టీ సభలైనా అందులోనే జరిగేవి. చిన్నా చితకా నాయకులూ కోనేటి మెట్లమీదే సమాలోచనలు జరిపేవారు. కోనేటికట్ట ఇప్పుడు ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితమయ్యాక సమీపంలోని హోటల్ రాజకీయ వేదికగా మారింది. చదలవాడ కృష్ణమూర్తి ఎమ్మెల్యేగా ఈ హోటల్‌లోని ఒక గదిలో తరచూ రాజకీయ సమాలోచనలు జరిపేవారు. ఆ తర్వాత కందాటి శంకర్ రెడ్డికి ఇదే గది వేదిక అయ్యింది. దివంగత ఎమ్మెల్యే వెంకటరమణ కూడా దీన్నే తన రాజకీయ కార్యకలాపాలకు కేంద్రం చేసుకున్నారు. ఆయన ఏకంగా ఒక ఫ్లోర్‌నే తన అధీనంలో ఉంచుకున్నారు. ఎన్నికల సరంజామా అంతా ఇక్కడి నుంచే పంపిణీ అవుతూ ఉండేది. 2004లోనూ, 2014లోనూ ఆయన విజయానికి ఈ హోటల్‌లోని ప్రత్యేకమైన ఆ గదే సెంటిమెంట్ అని నమ్మేవారు.ఆయన మరణానంతరం 2015 ఉప ఎన్నికలోనూ సుగుణమ్మ ఘనవిజయం వెనుక ఈ హోటల్ గది కీలకం అయ్యిందంటారు. 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం తర్వాత అధికార పార్టీ కీలక యువనేత దృష్టి టీడీపీ ముద్ర ఉన్న ఆ హోటల్ మీద పడింది. ఆ వెంటనే సెంటిమెంట్ గది వారి అధీనంలోకి మారిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికలన్నీ కోనేటికట్ట గట్టుపై ఉన్న ఆ హోటల్ నుంచే సాగించారని చెబుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్, టౌన్‌బ్యాంకు, ఎంపీ ఉప ఎన్నికల్లోనూ అదే హోటల్ గది వారికి ఉపయోగపడినట్లు ప్రచారం. ఇప్పుడూ ఆ హోటల్ మహా సందడిగా కనిపిస్తోంది. స్వంత పార్టీలోని అసంతృప్తులను బుజ్జగించడం, దారికిరాకపోతే తమదైన శైలిలో దారికి తెచ్చుకోవడం, ప్రతిపక్షాలకు చెందిన నాయకులను ప్రలోభాలకు గురిచేయడం వంటివన్నీ ఇక్కడే జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

# కొండెక్కిన రాజకీయం



పార్వేటమండపం వద్ద ముద్ర నారాయణతో తిరుమలవాసులు

- నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో కులం పేరుతో ఆత్మీయ సమావేశం
- మన యువ నాయకుడు అభినయ్‌ని గెలిపించుకోవాలంటూ తీర్మానం

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజకీయం ఏకంగా తిరుమల కొండెక్కింది. పవిత్రమైన తిరుమలలో నిబంధనలకు విరుద్ధంగా కులంపేరుతో సమావేశాన్ని నిర్వహించి తమ యువ నాయకుడిని గెలిపించుకోవాలంటూ తీర్మానాలు చేసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో తిరుపతి డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఆధ్వర్యంలో తిరుమలలోని పార్వేట మండపంలో శనివారం మధ్యాహ్నం బలిజ సంఘ ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తిరుమలలో స్థానికులకు ఎన్నో సౌకర్యాలు సమకూర్చిన ప్రస్తుత ఎమ్మెల్యే కరుణాకర రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించి బలిజల విశ్వాసాన్ని చాటాలని తీర్మానాలు చేసుకున్నారు. తిరుమలలో ఇలాంటి సమావేశాలు నిర్వహించడంపై నిషేధం వున్నప్పటికీ పార్వేటమండపంలో గోప్యంగా కులం పేరుతో రాజకీయ సమావేశాన్ని నిర్వహించడం విమర్శలకు దారితీసింది.

# మతిపోగొడుతున్న అగరాల జాబితా



అగరాల జాబితాలో 877వ నంబరునుంచి వరుసగా 16మంది ఓటర్లకు ఒకటిగానే నమోదైన తండ్రి లేదా భర్తల పేర్లు

చంద్రగిరి మండలంలోని పోలింగ్ కేంద్రం నంబరు 123 అగరాల గ్రామ ఓటర్ల జాబితాలో సీరియల్ నంబరు 878, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3406998లతో ఓటరు పేరు అబ్దుల్ రజాక్, వయసు 33 అని పురుషుడి పేరు నమోదై వుంది. కానీ లింగం స్త్రీ అని పేర్కొనడంతో పాటు ఫొటో కూడా స్త్రీదే వుంది. భర్త పేరు అని మళ్ళీ అబ్దుల్ రజాక్ పేరే కనిపిస్తోంది. అందులో పేర్కొన్న 8-248 నంబరు ఇంటికి వెళ్ళి ఆరా తీస్తే ఫొటోలో వున్న మహిళ పేరు షాకీరా అని తేలింది. ఓటరుగా ఆమె పేరు బదులు భర్త పేరు నమోదైంది. ఓటరు జాబితాలో ఈ తప్పిదాన్ని సరిదిద్దితే తప్ప ఈ కార్డు తీసుకెళ్ళి ఆమె ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేదు.చంద్రగిరి నియోజకవర్గంలో తుది ఓటర్ల జాబితా తయారైన తీరుకు ఇదో మంచి నిదర్శనం.

- ఓటరు కార్డుల్లో తప్పులే తప్పులు
- చంద్రగిరిలో మారని పాత పొరబాట్లు

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):కేంద్ర ఎన్నికల కమిషన్ మొదలుకుని, రాష్ట్ర ఎన్నికల అధికారులు, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు ఎంతగా మార్గదర్శకం చేసినా... ఎన్నిసార్లు సమీక్షించినా... ప్రత్యక్షంగా పరిశీలించినా... చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా తయారీపై అవేవీ ప్రభావం చూపలేదు. ఉదాహరణకు చంద్రగిరి మండలం అగరాల పోలింగ్ కేంద్రానికి చెందిన జాబితా చూస్తే మతి పోవడం ఖాయం. పోలింగ్ కేంద్రం 123 పరిధిలో సీరియల్ నంబరు 877 నుంచీ 892 వరకూ వరుసగా మొత్తం 16 కార్డులు ఇదే తీరులో వున్నాయి. కొన్ని కార్డుల్లో ఓటరు పేరు మగవారిదైతే ఫొటో ఆడవారిది ముద్రించి వుంది. అలాగే అన్ని కార్డుల్లో ఓటరు పేరు, తండ్రి లేదా భర్త పేరు రెండూ ఒకటే నమోదై వున్నాయి. ఈ తప్పుల కారణంగా ఈ ఎపిక్ కార్డులేవీ చెల్లుబాటు కాని పరిస్థితి నెలకొంది. ఇవన్నీ గతేడాది అక్టోబరు 27 - ఈ ఏడాది జనవరి 22 నడుమ నమోదు చేసినవి. ఈ తప్పిదాలను సరిదిద్దితే తప్ప ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లేదు.

**877** ఓటరు సీరియల్ నంబరు, ఐఏఎక్స్ 3397528 ఎపిక్ నంబరు, 2-251 ఇంటి నంబరు చిరునామాలతో ఖాదర్ బాషా, వయసు 20 అన్న పేరు జాబితాలో నమోదైంది. తండ్రి పేరు కూడా ఖాదర్‌బాషా అనే వుంది. ఆరా తీస్తే ఓటరు కార్డు ఖాదర్ బాషా కొడుకు సోహైల్‌ది. కానీ ఆ యువకుడి పేరు బదులు తండ్రి పేరు నమోదైంది. ఈ కార్డు ఓటు వేయడానికి పనికిరాదు.

**878** ఓటరు సీరియల్ నంబరు, ఐఏఎక్స్ 3406998 ఎపిక్ నంబరు, 8-248 ఇంటి నంబరుతో అబ్దుల్ రజాక్, వయసు 33 అని ఓటరు పేరు జాబితాలో వుంది. మగ పేరే అయినా లింగం వద్ద స్త్రీ అని, ఫోటో కూడా మహిళదే వుంది. భర్త పేరు మళ్ళీ అబ్దుల్ రజాక్ అనే వుంది. విచారిస్తే అబ్దుల్ రజాక్ భార్య షాకిరా పేరు బదులు ఆమె భర్తది నమోదు చేసినట్టు తేలింది. ఈ ఓటు వినియోగించుకునేందుకు పనికి రాదు.

**879** ఓటరు సీరియల్ నంబరు, ఐఏఎక్స్ 3407004 ఎపిక్ నంబరు, ఇంటి నంబరు 5-157 చిరునామాతో మహబూబ్ బాషా, వయసు 19 ఏళ్ళు అని ఓటరు పేరు చేర్చారు. పేరు పురుషుడిదైనా లింగం స్త్రీ అని, ఫొటో మహిళది ముద్రించి వుంది. తండ్రి పేరు చూస్తే మళ్ళీ మహబూబ్ బాషా అనే నమోదైంది. ఆ ఇంట్లో విచారిస్తే ఆ ఓటు మహబూబ్ బాషా కుమార్తె గౌసియా జాస్మిన్‌దని తేలింది. అయితే ఆమె పేరు కాకుండా తండ్రి పేరు నమోదు కావడంతో ఎపిక్ కార్డు నిరుపయోగంగా మారింది.

**సీరియల్ నంబరు 880,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3410909, ఇంటి నంబరు 5-156 చిరునామాతో సుల్తాన్, వయసు 34గా ఓటరు పేరు నమోదైంది. పేరు పురుషుడిదైనా లింగం స్త్రీ అని, ఫొటో కూడా మహిళదే వుంది. భర్త పేరు వద్ద సుల్తాన్ అన్న పేరే నమోదైంది. ఇక్కడా అంతే. ఓటరు ఫొటోలో వున్నది సుల్తాన్ భార్య షంషీదా. ఆమె పేరు బదులు భర్త పేరు నమోదైంది. ఈ ఓటు కూడా ఉపయోగించుకునేందుకు వీలు కాకుండా పోయింది.

**సీరియల్ నంబరు 881,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3405164, ఇంటి నంబరు 2-26 చిరునామాతో చంద్రశేఖర్ పేరు నమోదైంది. తండ్రి పేరు కూడా చంద్రశేఖర్ అనే వుంది. రోళ్ళు కొట్టే తమిళనాడువాసులని, ఎక్కువ రోజులు సంచారంలోనే వుంటారని చుట్టుపక్కల వారు చెప్పారు. కుటుంబీకులు అందుబాటులో లేకపోవడంతో వీరి వివరాలు తెలియలేదు.

**సీరియల్ నంబరు 882,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3405172, ఇంటి నంబరు 1-37 చిరునామాతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ తంగరాజు అనే నమోదయ్యాయి. ఓటరు లింగం స్త్రీ అని, ఫొటో కూడా యువతిది ముద్రించి వుంది. తమిళనాడుకు చెందిన వలస కార్మికులైన వీరి వివరాలు కూడా తెలియరాలేదు.

**సీరియల్ నంబరు 883,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3406964, ఇంటి నంబరు 1-23 చిరునామాతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ పునుగు గురుస్వామి అని నమోదై వుంది. విచారిస్తే జాబితాలో వున్న ఫొటో గురుస్వామి కుమారుడు వెంకటేశ్‌దని తేలింది. ఓటరు పేరు వద్ద వెంకటేశ్ పేరు కాకుండా తండ్రి గురుస్వామి పేరు నమోదైంది. దీంతో ఈ ఓటు వినియోగానికి పనికిరాకుండా పోయింది.

**సీరియల్ నంబరు 884,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3406972, ఇంటి నంబరు 1-43 చిరునామాతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ సురేష్ బాబు అని ముద్రించి వుంది. ఫొటో మాత్రం మహిళది కనిపిస్తోంది. ఇంటిలో ఆరా తీస్తే ఫొటోలో వున్నది సురేష్ బాబు కుమార్తె అస్మిత అని, ఓటరుగా ఆమె పేరు బదులు తండ్రి పేరు నమోదు చేశారని తెలిసింది. దీంతో ఈ ఓటు కూడా వ్యర్థమైంది.

**సీరియల్ నంబరు 885,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3406980, ఇంటి నంబరు 1-45 చిరునామాతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ పోలినాయుడు అని నమోదైంది. వయసు 23, లింగం స్త్రీ అని వుండడంతో పాటు ఫొటోలో మహిళ వున్నారు. విచారిస్తే ఫొటోలో వున్నది పోలినాయుడు భార్య భువనేశ్వరి అని, ఓటరుగా ఆమె పేరు కాకుండా భర్త పోలినాయుడు పేరు నమోదైందని తేలింది. దీంతో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఆమెకు లేకుండా పోయింది.

**సీరియల్ నంబరు 886,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3411816, ఇంటి నంబరు 1-19 అడ్రసుతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ వి.గోవిందు స్వామి అని ముద్రించి వుంది. ఇంటి వద్దకు వెళ్ళి విచారించగా ఫొటోలో వున్నది గోవిందు స్వామి కుమారుడు నాగరాజు అని, ఓటరుగా అతడి పేరు బదులు తండ్రి పేరు నమోదైందని వెల్లడైంది.

**సీరియల్ నంబరు 887,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3414216, ఇంటి నంబరు 7-208-ఏ అడ్రసుతో ఓటరు పేరు, భర్త పేరు రెండూ పి.గంగాధరం అని నమోదయ్యాయి.ఫొటో మాత్రం మహిళది వుంది. ఫొటోలో వున్నది భార్య ప్రమీల కాగా ఆమె పేరు కాకుండా ఓటరుగా భర్త పేరు ఎంటర్ చేశారని తేలింది.

**సీరియల్ నంబరు 888,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3414224లతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ తుక్కాకుల భాస్కర్ రెడ్డి అని నమోదయ్యాయి.ఫొటోలో వున్నది కుమారుడు రోహిత్‌రెడ్డి అని, ఓటరుగా అతడి పేరు కాకుండా తండ్రి పేరు నమోదయ్యాయని తెలిసింది.

**సీరియల్ నంబరు 889,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3414471, ఇంటి నంబరు 2-24 చిరునామాతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ జి.సురేష్ అని వుంది. తర్వాతి వివరాల్లో స్త్రీ అని వుండడంతో పాటు ఫొటోలో కూడా యువతి వుంది. విచారిస్తే ఫొటోలో వున్నది సురేష్ కుమార్తె అశ్విని అని, ఓటరుగా ఆమె పేరు బదులు తండ్రి పేరు నమోదైందని తెలిసింది.

**సీరియల్ నంబరు 890,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3414489, ఇంటి నంబరు 7-213 అడ్రసుతో యల్లయ్య, వయసు 18 అని ఓటరు పేరు నమోదైంది. తర్వాతి వివరాల్లో స్త్రీ అని, ఫొటోలో యువతి వున్నారు.ఫొటోలో వున్నది యల్లయ్య కుమార్తె శృతి కాగా ఓటరుగా ఆ యువతి పేరు కాకుండా తండ్రి పేరు నమోదైందని తేలింది.

**సీరియల్ నంబరు 891,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3423290, ఇంటి నంబరు 3-92 అడ్రసుతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ తులసీదాస్ అని నమోదైంది. ఆరా తీయగా ఫొటోలో వున్నది తులసీదాస్ కొడుకు గణేష్ అని, ఓటరుగా గణేష్ పేరు బదులు తండ్రి పేరు నమోదైందని తెలిసింది.

**సీరియల్ నంబరు 892,** ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 3423316, ఇంటి నంబరు 1-19 వివరాలతో ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ పి.నగరాజు అని నమోదై వుండగా తదుపరి వివరాల్లో స్త్రీ అని, ఫొటో కూడా మహిళదే వుంది. ఆరా తీయగా ఫొటోలో వున్నది నాగరాజు భార్య లలిత అని, ఓటరుగా ఆమె పేరు కాకుండా భర్త పేరు నమోదైందని తేలింది.


## గ్రామస్తులకే తెలియని ఓటర్లు


చంద్రగిరి మండలం అగరాల గ్రామంలో పోలింగ్ కేంద్రం నంబరు 123 పరిధిలో పలువురు ఓటర్లు గ్రామస్తులకే తెలియడం లేదు. గ్రామంలో జాబితాను పరిశీలించగా ఓటరు సీరియల్ నంబరు 865తో నమోదైన పేరు అర్థం కావడం లేదు. సందియ తర్వాత పేరు పలకడానికి కూడా వీలు కానంత విచిత్రంగా వుంది. వయసు 23 అని నమోదు కాగా భర్త పేరు కూడా అర్థం కాకుండా వుంది. ఇంటి నంబరు 2-01గా పేర్కొన్నా గ్రామంలో ఆ ఇంటి నంబర్లు లేవు.ఫొటోను కూడా ఎవరూ గుర్తించలేకపోయారు. ఓటరు సీరియల్ నంబరు 866తో నమోదైన ఓటరు పేరు, తండ్రి పేరు రెండూ బాబు మునాఫ్ అని నమోదయ్యాయి. వయసు 54 అని, ఇంటి నంబరు 3-96 అని పేర్కొన్నారు. కానీ ఆ నంబరు ఇంట్లో ఆ పేరు గలవారు లేరు. గ్రామస్తులు కూడా ఫొటోను గుర్తించలేదు. తమకు తెలియదన్నారు. అదే విధంగా ఓటరు సీరియల్ నంబరు 870తో నమోదైన ఓటరు పేరు ప్రసాంగా అని, వయసు 23, తండ్రి పేరు శశికుమార్ అని వుంది. కానీ గ్రామస్తులు వారెవరో తెలియదని చెబుతున్నారు. కనీసం డోర్ నంబరు కూడా లేదు. అగరాల అని గ్రామం పేరు మాత్రమే జాబితాలో నమోదైంది.




## ఈ ఓటరును గుర్తించేదెలా?

చంద్రగిరి మండలం రంగంపేట గ్రామం పోలింగ్ కేంద్రం 111 పరిధిలో ఓటరు సీరియల్ నంబరు 207, ఎపిక్ నంబరు ఐఏఎక్స్ 2194322, డోర్ నంబరు 10-1 చిరునామాతో నమోదైన పేరు తికమక పెడుతోంది. ఓటరు పేరు గూప గగలలపజ, వయసు 26, తండ్రి పేరు కలపగక గగరప... అని నమోదైంది. ఫొటోలో వున్న వ్యక్తిని స్థానికులు గుర్తించలేదు. పేర్లు అంతుబట్టడం లేదు.




# మరోసారి తిరుమల మీదుగా విమానం



తిరుమల మీదుగా శనివారం ప్రయాణిస్తున్న విమానం

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి):తిరుమల క్షేత్రంపై శనివారం మరోసారి విమానం ప్రయాణించింది. ఆగమశాస్త్రం ప్రకారం వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న క్షేత్రం మీదుగా విమానాలు ప్రయాణించకూడదని టీడీపీ చెబుతోంది. ఈ దిశగా తిరుమలను నోఫ్లైయింగ్ జోన్‌గా ప్రకటించాలని పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినప్పటికీ సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది. అయినప్పటికీ భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని వీలైనంత వరకు విమానాలు తిరుమల మీదుగా ప్రయాణించకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కానీ కొద్ది నెలలుగా తిరుమల క్షేత్రం మీదుగా విమానాలు అప్పుడప్పుడూ ప్రయాణిస్తూనే ఉన్న క్రమంలో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# మూడేళ్ల చిన్నారిని తల్లిదండ్రులే చంపేశారు!

## మంచానికే పరిమితమైన బిడ్డను చూడలేక విరక్తితోనే



చిన్నారి గురుశిల్ప (ఫైల్ ఫొటో)

చిట్టమూరు, ఫిబ్రవరి 3 : పుట్టి మూడేళ్లయినా మంచానికే పరిమితమైన బిడ్డను చూడలేక తల్లిదండ్రులే కాటికి పంపారు. హృదయవిదారమైన ఈ వుదంతం చిట్టమూరు మండలంలో చోటు చేసుకుంది. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి కథనం మేరకు.....చిట్టమూరు చెరువులో గతనెల 24వ తేదీన చిన్నారి మృతదేహం లభ్యమైంది. చిట్టమూరుకే చెందిన ఇద్దరు యువకులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ లక్ష్మీభవాని ఆ మృతదేహాన్ని బయటకు తీయించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.పెళ్లకూరు మండలం తాళవాయిపాడు గ్రామానికి చెందిన సూళ్లూరు గురవయ్య, మమత దంపతులకు మూడేళ్ల క్రితం కూతురు పుట్టింది.ఆమెకు గురుశిల్ప అని పేరుపెట్టారు.చిన్న మెదడు ఎదుగుదల లేకపోవడంతో పాప ఎప్పటికీ మాట్లాడలేదని, నడవలేదని వైద్యులు చెప్పారు.మూడేళ్లుగా పాప మంచంలోనే ఉండిపోవడంతో మానసికంగా కుంగిపోయిన తల్లిదండ్రులు విరక్తితో చంపేయాలని నిర్ణయించుకున్నారు.గత నెల 20వ తేదీన మధ్యాహ్నం గురవయ్య ఇంటిలోనే టవల్ పాప నోటిలో కుక్కి ఊపిరి ఆడనీయకుండా చేసి హత్య చేశాడు. తల్లి ఇంటి బయట కాపలా ఉండగా తండ్రి గురవయ్య చిన్నారిని హత్య చేసినట్లు డీఎస్పీ తెలిపారు.తరువాత మమత స్వగ్రామమైన కోట మార్గంలోని చిట్టమూరు చెరువులో చిన్నారిని తీసుకువచ్చి పడవేసినట్లు తెలిపారు. జనవరి 24వ తేదీ పాప మృతదేహం లభ్యం కావడంతో సీఐ హరికృష్ణ, ఎస్ఐలు గోపి, లక్ష్మీభవాని విచారణ చేపట్టారు. నిందితులను అరెస్టు చేసి గూడూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

## టీడీపీతోనే బీసీల అభ్యున్నతి: నెలవల




సభలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

దొరవారిసత్రం, ఫిబ్రవరి 3: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యమని మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు.శనివారం దొరవారిసత్రంలో జయహో బీసీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం ఇచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. అయితే సీఎం జగన్ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 24శాతం మాత్రమే ఇచ్చి అన్యాయం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు ముమ్మడి వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ యచ్చగుంట రత్నయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మునస్వామి, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ ఖలీల్, షఫీ, వెంకటేశ్వర్లు, గోను జక్కరయ్య, బాబునాయుడు, శ్రీనివాసులు, పరంధామయ్య, మనోహర్ రెడ్డి, విజయ, పురుషోత్తంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అరాచక పాలనకు స్వస్తి పలకండి: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు స్వస్తి చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం తన నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజం గెలవాలి.. కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి నియోజకవర్గంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేసిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు వేచిచూస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు తీసుకుపోవాలన్నా, నిరుద్యోగ సమస్య రూపుమాపాలన్నా, యువత భవతకు బంగారు బాట వేయాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమని కురుగొండ్ల పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పప్పు చంద్రమౌళిరెడ్డి, కేవీకే ప్రసాద్ నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు రెడ్డి, గల్లా శ్రీనివాసులు, కాపా శ్రీనివాసులు నాయుడు, హేమంత్ చౌదరి, సుకుమార్, నానీ, కొల్లాపూరు సుధా తదితరులు పాల్గొన్నారు.

## రాజధాని ప్రజామోదయోగ్యంగా ఉండాలి: చింతా




సూళ్లూరుపేటలో ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాయుడుపేట టౌన్/సూళ్లూరుపేట/గూడూరు, ఫిబ్రవరి 3: రాష్ట్ర రాజధాని ప్రజామోదయోగ్యంగా ఉండాలని కేంద్ర మాజీమంత్రి డాక్టర్ చింతా మోహన్ అన్నారు. శనివారం నాయుడుపేట పట్టణంలో పాతబస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు రాజధాని అమరావతి అంటే, ప్రస్తుత సీఎం జగన్ మాడు రాజధానులు అంటున్నారని, అదేవిధంగా విశాఖపట్నానికి తరలిస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ అనువైన ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేయాలని కోరారు. తిరుపతిని రాజధాని చేసేందుకు సరైన ప్రాంతమని అన్నారు. ఇందుకోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాబ్యాలెట్ నిర్వహిస్తామని తెలిపారు. గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ కేంద్రం వద్ద చింతామోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. అలాగే సూళ్లూరుపేటలోని గాంధీ విగ్రహం నుంచి ఆర్‌అండ్‌బీ బంగ్లా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పంటా శ్రీనివాసులురెడ్డి, పూల చంద్రశేఖర్, తీగల భాస్కర్, బ్రహ్మయ్య, వేమయ్య, భాస్కర్, సుబ్బరామరాజు, చంద్రశేఖర్, శివ, వెంకటయ్య, నాగూర్, రావణ్, తేజావతి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు

## సూళ్లూరుపేట/వెంకటగిరి

## అదృశ్యమైన యువకుడి మృతి

గూడూరు, ఫిబ్రవరి 3: అదృశ్యమైన యువకుడు మృతి చెంది వుండటాన్ని పోలీసులు గుర్తించారు. రూరల్ పోలీసుల కథనం మేరకు... స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన కృపానంద్(29) ఓ బ్యాంకులో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గత నెల 29వ తేదీన చెన్నూరులోని స్నేహితుల ఇంటికి వెళ్లాడు. అప్పటి నుంచి తన కుమారుడు కనిపించడంలేదని కృపానంద్ తండ్రి ప్రసాద్ గత నెల 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నూరులో కృపానంద్ స్నేహితుడి ఇంటి సమీపంలోని మురుగునీటితో ఉండే కొత్తగుంటకాలువలో దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా కృపానంద్ మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు కాలువలోపడి మృతి చెందివుంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తడ, ఫిబ్రవరి 3: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. తమిళనాడు ఎలాఊరుకు చెందిన మదన్ శనివారం రైల్లో తడకు వచ్చాడు. రైల్వేస్టేషన్ నుంచి జాతీయ రహదారిపైకి వచ్చి డివైడర్ దాటుతుండగా అదుపుతప్పి కింద పడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న లారీ అతనిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మదన్ కాలుకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం చెన్నైకు తరలించారు. పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

# అరాచక పాలనను అంతమొందించాలి: టీడీపీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, ఫిబ్రవరి 3: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనను అంతమొందించాలని టీడీపీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని ఎగువరాజుపాళెంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమవుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్, బస్సు చార్జీలు, పన్నులు, నిత్యావసరాల ధరలు పెంచేయడంతో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ చంద్రబాబునాయుడు మినీమేనిఫెస్టోను రూపొందించారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గుండాల లీలావతి, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, నెల్లటూరు చిరంజీవి, సుప్రజ, గుండాల శ్రీనివాసులు, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, అన్నం మునిశేఖర్‌గౌడ్, కీరవాణి, కీర్తిపాటి కోటేశ్వరరాజు, పిచ్చిరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని వైసీపీ గంజాయి కేంద్రంగా మార్చింది: టీడీపీ



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 3: వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి రవాణాకు కేంద్రంగా మార్చి యువత భవిష్యత్తును నిర్వీర్యం చేస్తోందని తిరుపతి పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య అన్నారు. శనివారం గూడూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులకు టోకరా వేసే ప్రయత్నం చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని యువత ముందుకు వచ్చి గద్దె దించాలని కోరారు. దేశంలో గంజాయి ఎక్కడ పట్టుబడిన దాని మూలాలు మన రాష్ట్రంలోనే బయటపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం జగన్ సభ కోసం ఇంటర్మీడియట్ పరీక్షను రద్దు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం మంచి పద్ధతికాదన్నారు. కార్యక్రమంలో ఇశ్రాయిల్‌కుమార్, పిళ్లెల శ్రీనివాసులు, అల్లీహుస్సేన్, చక్రవర్తి, సిరాజ్, నరేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్ బాబు

డక్కిలి, ఫిబ్రవరి 3: మండలంలో దీర్ఘకాలంగా నెలకొన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరిగిందని తహసీల్దార్ రమేష్ బాబు అన్నారు. డక్కిలి మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనం పథకం బియ్యాన్ని కమ్మపల్లికి చేర్చకుండా లింగసముద్రం స్టాక్ పాయింట్‌కు తరలించం పట్ల మాధవాయపాళెం సింగిల్ విండో అధ్యక్షుడు నర్రావుల వేణుగోపాల నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. డి.ఉప్పరపల్లిలో ప్రాథమిక పాఠశాలలో ఒకే టీచరు వుండటం వల్ల విద్యాప్రమాణాలు కుంటుబడుతున్నాయని సర్పంచు ఏఎం రత్నం సభ దృష్టికి తీసుకు వచ్చారు. అంతేకాకుండా గ్రామంలో అంగన్‌వాడీ పాఠశాలకు శాశ్వత భవనం లేకపోవడం వల్ల పంచాయతీ కార్యాయంలో నిర్వహిస్తున్నారని, దీనివల్ల ఇబ్బందిగా వుందని చెప్పారు. డక్కిలి వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీఎంను ఎలాంటి విచారణ లేకుండానే బదిలీ చేయడం సరికాదని లింగసముద్రం ఎంపీటీసీ కోటి అన్నారు. ఎంపీడీవో లీలా మాధవి మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ జహీర్ అహ్మద్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖర రెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## చదువులతోనే ఉజ్వల భవిత



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు, ఫిబ్రవరి 3: చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక నరశింగరావుపేటలోని బాలసదనంలో అరవ వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీలు లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదివి సాధించుకోవాలన్నారు. అనంతరం నెల్లూరుకు చెందిన రాఫా ఐ కేర్ వైద్యురాలు రూపకళా హిమబిందు విద్యార్థినిలకు కంటి పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు అరవ పార్వతయ్య, డాక్టర్ రోహిణి, సాయికుమార్‌రెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల నిరసన

వాకాడు, ఫిబ్రవరి 3: విశాఖలో తహసీల్దారు రమణయ్య హత్యకు నిరసనగా వాకాడు రెవెన్యూ కార్యాలయ సిబ్బంది నిరసన తెలిపారు. తహసీల్దారు నరసింహారావు ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆర్ఐ సెల్వరాజ్, సీనియర్ అసిస్టెంట్ సుధా తదితరులు ఉన్నారు.

## గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి

కోట, ఫిబ్రవరి 3: గ్రామీణ భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు చాపల వెంకటేశ్వర్లు కోరారు. కోటలో శనివారం ఆటో వర్కర్స్ యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయడంలో ప్రతి కార్మికుడు కీలకపాత్ర పోషించాలని అన్నారు. ఆటో కార్మికులకు చదువుతో నిమిత్తం లేకుండా లైసెన్స్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోపాలయ్య, రమణయ్య, హరనాథ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆసరా చెక్కుల పంపిణీ

గూడూరు, ఫిబ్రవరి 3: స్థానిక సీఆర్‌రెడ్డి కళ్యాణ మండపంలో శనివారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని 844 పొదుపు సంఘాలకు రూ.6.44 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, బొమిడి శ్రీనివాసులు, కోదండరామయ్య, సాయి, గఫూర్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**పెళ్లకూరు:** స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో డీఆర్‌డీఏ పీడీ జ్యోతి ఆధ్వర్యంలో నాలుగో విడుత ఆసరా చెక్కుల పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎస్సీసీసీటీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మండలంలోని 647 స్వయం సహాయక సంఘాల్లోని 6231 మంది సభ్యులకు రూ.4,37,31,758 మెగా చెక్కును అందజేశారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, డీఆర్‌డీఏ మేనేజర్ సుబ్బారెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, వెలుగు ఏపీఎం మునిరాజయ్య, ఏసీ మురళి, వైసీపీ మండల కన్వీనర్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

**ఓజిలి:** స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వెలుగు ఏపీఎం ఏరియా కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో ఆసరా చెక్కుల పంపిణీ జరిగింది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులమీదుగా చెక్కులు అందజేశారు. ఎంపీపీ అరుణమ్మ, జడ్పీటీసీ రవీంద్రబాబు, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, వైసీపీ మండల కన్వీనర్ హరినాద్‌రెడ్డి, రాజారాంరెడ్డి, శోభమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దారుకు సన్మానం



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న ఆర్డీవో

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3: సూళ్లూరుపేట తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న రవికుమార్‌ను శనివారం సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో చంద్రముని ముఖ్య అతిథిగా విచ్చేశారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎంపీడీవో మురళీకృష్ణ, డీటీలు చైతన్య, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలుకల నివారణపై అవగాహన

కోట, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని చిట్టేడులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం సామూహిక ఎలుకల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇన్‌చార్జి ఏడీ సుచేంద్రప్రసాద్, ఏవో నిరంజన్‌కుమార్ చిట్టేడుతో పాటు పరిసర గ్రామాల్లోని రైతులకు వరి పంటలను ఎలుకలు నాశనం చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. గ్రోమోడయోలోన్‌తో ఎలుకలను నివారించే విధానాన్ని గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ తిరుపతి, సహాయ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

**వాకాడు:** మండలంలోని నెలిపూడి సచివాలయ పరిధిలో రైతులకు ఎలుకల నివారణ మందు తయారీపై అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ అధికారిణి దీప మాట్లాడుతూ బ్రమడాఏలిన్ మందును తయారు చేసి ప్రతి బొరియ వద్ద 10 గ్రాముల చొప్పున పెట్టాలన్నారు. రైతులకు ఉచితంగా ఆయా సచివాలయాల పరిధిలో బ్రమడాఏలిన్ మందును పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎంఈవోకు వినతి

కోట, ఫిబ్రవరి 3: తమ సమస్యలను పరిష్కరించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలతో పాటు సంవత్సరానికి రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, హరనాథ్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సోమిరెడ్డికి సన్మానం



నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 3: మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని సూళ్లూరుపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కాలేషా సన్మానించారు. నెల్లూరులోని ఆయన నివాసంలో సోమిరెడ్డిని కలిసిన షేక్ కాలేషా శాలువా కప్పి సన్మానించారు.

## రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థినిలు



విద్యార్థినిలను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

గూడూరు, ఫిబ్రవరి 3: రాష్ట్రస్థాయి బాలికల టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న మండలంలోని విందూరు ఉన్నత పాఠశాల విద్యార్థినిలను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ గతేడాది సెప్టెంబరు 26వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన బాలికల టెన్నికాయిట్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థినిలు వర్షిణి, వెంకటజ్యోత్స్న జిల్లా జట్టుకు ఎంపిక కావడం జరిగిందన్నారు. ఏలూరు జిల్లాలో ఆదివారం నుంచి మంగళవారం వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కరిముల్లా, వేణు, పుల్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సన్నద్ధం కండి: బీజేపీ

నాయుడుపేట, ఫిబ్రవరి 3: రాబోవు పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. శనివారం నాయుడుపేటలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇస్తున్న సంక్షేమ, అభివృద్ధి నిధులను గ్రామస్థాయిలో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి పార్థసారథి, నాయకులు రంగినేని కృష్ణయ్య, సురేంద్ర, చంద్రశేఖర్, భాను ప్రకాష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ యాత్రికుడికి సత్కారం



అంబుచార్లెస్‌ను సత్కరిస్తున్న మస్తాన్

వెంకటగిరి, ఫిబ్రవరి 3: తమిళనాడు రాష్ట్రం నామక్కల్ జిల్లాకు చెందిన సైకిల్ యాత్రికుడు అంబుచార్లెస్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్ సత్కరించారు. 2005లో సైకిల్ యాత్రను ప్రారంభించిన అంబుచార్లెస్ దేశవ్యాప్తంగా 49200 కిలోమీటర్లు ప్రయాణించి శనివారం వెంకటగిరికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా అంబుచార్లెస్‌ను డాక్టర్ బొలిగల మస్థాన్ యాదవ్ శాలువాలతో సత్కరించడంతో పాటు ఆర్థిక సాయం అందించారు.

## వాటంబేడులో న్యాయవిజ్ఞాన సదస్సు

తడ, ఫిబ్రవరి 3: వాటంబేడు ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. శనివారం సూళ్లూరుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి అనిల్ కుమార్ విద్యార్థులకు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు చలపతి, ధర్మాప్రసాద్, శ్రీరాములుయాదవ్ పాల్గొన్నారు.

## తాగునీటి పథకాల పరిశీలన

కోట, ఫిబ్రవరి 3: మండల పరిధిలోని రంగన్నగుంట వద్ద ఉన్న తాగునీటి పథకాల పైపు లైన్లు, మోటార్లు, నీటి నిల్వలను ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ విజయకుమార్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఇక్కడ స్వర్ణముఖిలో ఫిల్టర్‌పాయింట్లు వేసి 59 పథకాల ద్వారా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజలకు సాగునీరు అందిస్తున్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో స్వర్ణముఖినదిలో ఉన్న నీటి నిల్వలు, భూగర్భజలాల శాతాన్ని అధికారులు పరిశీలించారు. ఏ ఒక్క గ్రామానికి కూడా తాగునీరు సరఫరా ఆగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పలువురు ఈఈలు, ఏఈలు ఉన్నారు.

## క్రీడాకారుడికి దుస్తుల అందజేత



నవీన్‌కుమార్‌కు క్రీడా దుస్తులను అందజేస్తున్న డిప్యూటీఈవో శివప్రకాష్‌రెడ్డి

గూడూరు, ఫిబ్రవరి 3: జాతీయస్థాయి అథెలిటిక్స్ పోటీల్లో పాల్గొననున్న స్థానిక జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి నవీన్‌కుమార్‌కు డిప్యూటీ ఈవో శివప్రకాష్‌రెడ్డి శనివారం క్రీడాదుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబరు మొదటి వారంలో నెల్లూరులో నిర్వహించిన నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథెలిటిక్స్ మీట్(ఎన్ఐడీజేఏఎం)లో స్థానిక జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న నవీన్‌కుమార్ 600మీటర్ల రన్నింగ్ విభాగంలో ప్రతిభ చూపి జాతీయస్థాయి అథెలిటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో అథెలిటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి అథెలిటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో నవీన్‌కుమార్ పాల్గొంటాడని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం మున్వర్‌బాషా, పీడీ వెంకటసుబ్బయ్య, శివకుమార్, లత తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

చిల్లకూరు, ఫిబ్రవరి 3: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేకపూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, రాత్రికి పల్లకీసేవ నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రదాలు స్వీకరించారు.

## ప్రసన్న వెంకటేశ్వరుడికి...

కోట, ఫిబ్రవరి 3: కోట పట్టణ పరిధిలోని శ్రీలక్ష్మమ్మ కాలనీలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు సాయిబాబా ఆధ్వర్యంలో ప్రసన్న వెంకటేశ్వరుడికి పలు అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచారు. కోట పట్టణంతోపాటు పరిసర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు పాలక మండలి ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం జరిగింది.